చదవండి.. చదివించండి..
నేటి శుభోదయ
ప్రతిక్షణం.. ప్రజల కోసం...
నిజమైన వార్తలు... నమ్మకమైన పత్రిక
వార్తలు, ప్రకటనల కోసం సంప్రదించండి
మా వెబ్‌సైట్ www.netishubhodaya.com
వాట్సాప్ 96965 71571
మీ నమ్మకం.. మా బాధ్యత.. శుభోదయంతో ప్రతి ఉదయం ప్రగతివైపు!

RNI TELTEL/2024/89620
తెలంగాణ
నేటి శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక

GK MEDIA Voice of People
CHANNEL NO. 433
SSLC CABLE NETWORK
SSLC కేబుల్ నెట్‌వర్క్‌లో వస్తుంది

ప్రచురణ : తెలంగాణ | సంపుటి 01 | సంచిక 173 | సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు | పేజీలు - 08 | గురువారం 13 - ఆగష్టు - 2026 | వెల రూ. 5 /-



## ఎల్లంపల్లి, దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి

# నీటిని లిఫ్ట్ చేయాలి

### - సీఎం రేవంత్ ఆదేశం

- గోదావరి జలాల వినియోగంపై సీఎం రేవంత్ కీలక ఆదేశాలు
- గోదావరి నదీ జలాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయం
- కాళేశ్వరం బ్యారేజీల భద్రతపై ఎన్డీఎస్ఏ సూచనలను కచ్చితంగా పాటించాలని స్పష్టం
- భూ నిర్వాసితులకు పరిహారం వెంటనే చెల్లించేందుకు కార్యాచరణకు ఆదేశం

**నేటి శుభోదయ, హైదరాబాద్ :** గోదావరి నదీ జలాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఎల్లంపల్లి, దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల ద్వారా నీటి ఎత్తిపోతల (లిఫ్ట్) ప్రక్రియను ముమ్మరం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన నీటిపారుదల శాఖపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) సిఫార్సుల మేరకు ప్రస్తుతం సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీలలో నీటిని నిల్వ చేయడం లేదని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ఎన్డీఎస్ఏ మార్గదర్శకాలను అధికారులు కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీలలో కొన్ని లోపాలను గుర్తించినట్లు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించగా, ఈ అంశంపై తక్షణమే ఎన్డీఎస్ఏను సంప్రదించాలని సీఎం సూచించారు. దేవాదుల ప్రాజెక్టులో తొమ్మిది పంపుల ద్వారా నీటిని లిఫ్ట్ చేయడం కీలకమని, అక్కడ ఎదురవుతున్న చిన్నచిన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వివిధ ప్రాజెక్టుల కింద భూములు కోల్పోయిన రైతులకు చెల్లించాల్సిన పరిహారంపై కూడా ఈ సమావేశంలో సమీక్షించారు. నష్టపరిహారాన్ని తక్షణమే చెల్లించేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ముంపునకు గురయ్యే గ్రామాలు, పెండింగ్ పరిహారం, పునరావాస ప్యాకేజీలపై క్షేత్రస్థాయిలో పర్యటించి సమగ్ర నివేదికలు అందజేయాలని రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులను ఆదేశించారు. బాధితులకు త్వరితగతిన పరిహారం చెల్లిస్తేనే బస్వాపూర్, గౌరవెల్లి ప్రాజెక్టులను నింపడానికి వీలవుతుందని ఆయన పేర్కొన్నారు. గట్టు, గుడెందొడ్డి ఎత్తిపోతల పథకాల సామర్థ్యం పెంపుపై తగిన అధ్యయనం చేయాలని, గుడెందొడ్డి పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుకు కన్సల్టెంట్‌ను నియమించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## జెన్-జీకి ప్రధాని నరేంద్రమోదీ కీలక సూచన



- జీవితంలో షార్ట్‌కట్‌లు ప్రమాదకరమన్న ప్రధాని నరేంద్ర మోదీ
- సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, రీల్స్‌తో జాగ్రత్తగా ఉండాలని సూచన
- గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలు చదవాలంటూ యువతకు హితవు
- మాజీ రాష్ట్రపతి కోవింద్ ఆత్మకథ ఆవిష్కరణ సభలో వ్యాఖ్యలు

2

## 3 గంటల వరకు సభలో ఉంటా.. ప్రతిపక్షాలకు అమిత్ షా సవాల్



- ప్రతిపక్షానికి అమిత్ షా 24 గంటల ఆఫర్
- నేడు 3 గంటల వరకు చర్చకు సిద్ధమని వెల్లడి
- ఏ ప్రశ్నకైనా సమాధానం ఇస్తానని షా ప్రకటన
- నీట్ ఆందోళనలపై చర్చకు ప్రభుత్వం సిద్ధమని స్పష్టీకరణ
- ఇక ఎవరు పారిపోతున్నారో ప్రజలే నిర్ణయిస్తారని వ్యాఖ్య

2

## ఆసుపత్రుల రూమ్ చార్జీలకు పరిమితి.. పార్లమెంటరీ కమిటీ కీలక సిఫార్సు



2

## మేం 'టీ-హబ్' కడితే.. రేవంత్ 'అనుముల హబ్' కడుతున్నారు : కేటీఆర్



- సీఎం రేవంత్ రెడ్డి, ఆయన సోదరుడిపై కేటీఆర్ విమర్శల దాడి
- మేం టీ-హబ్ కడితే.. రేవంత్ 'అనుముల హబ్స్' తెస్తున్నారని ఎద్దేవా
- సీఎం సోదరుడి సంస్థకు రూ. 200 కోట్ల విలువైన భూమి కట్టబెట్టారని ఆరోపణ
- లక్ష మూలధనం ఉన్న కంపెనీకి భూ కేటాయింపులపై సమగ్ర విచారణకు డిమాండ్

2

## తెలంగాణలో సగం డిగ్రీ కాలేజీలకు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాళ్లే!

- తెలంగాణలో 75 డిగ్రీ కాలేజీల్లో లేని రెగ్యులర్ ప్రిన్సిపాళ్లు
- ఇన్‌చార్జ్‌లతో పాలన.. విద్యార్థులకు తప్పని తిప్పలు
- ఒక్కో ప్రిన్సిపాల్‌కు రెండు, మూడు కాలేజీల బాధ్యతలు
- పదోన్నతుల్లో జాప్యం, సీనియారిటీ వివాదాలే కారణం




2

## ఆపరేషన్ సిందూర్ తర్వాత మారిన పాక్ వ్యూహం..

### - ఉగ్ర సంస్థలపై ఐఎస్ఐ పట్టు

- లష్కరే, జైష్, హిజ్బుల్ కార్యకలాపాలను నేరుగా పర్యవేక్షిస్తున్న ఐఎస్ఐ
- ఇప్పటివరకు ఈ మూడు సంస్థలకు వేర్వేరు కమాండ్ కేంద్రాలు
- ఇక్బాల్, ఒవైజ్ అనే ఇద్దరు ఐఎస్ఐ అధికారుల పర్యవేక్షణలో 3 సంస్థలు



**నేటి శుభోదయ, న్యూ ఢిల్లీ :** పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్ర సంస్థల కార్యకలాపాల తీరు మారినట్లు భారత నిఘా వర్గాలు గుర్తించాయి. ఆపరేషన్ సిందూర్ తర్వాత లష్కర్-ఏ-తోయిబా, జైష్-ఏ-మహ్మద్, హిజ్బుల్ ముజాహిదీన్‌ల కార్యకలాపాలపై పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ నేరుగా పట్టు సాధించినట్లు సమాచారం. ఇప్పటివరకు ఈ మూడు సంస్థలకు వేర్వేరు కమాండ్ కేంద్రాలు ఉండేవి. చొరబాట్లు, ఇతర కార్యకలాపాలను ఆయా సంస్థల నేతలు, హ్యాండ్లర్లు పర్యవేక్షించేవారు. తాజాగా ఈ విధానాన్ని మార్చినట్లు అధికారులు తెలిపారు.....

2

## తెలంగాణలో ఓటర్ల జాబితా సవరణ

### - ఫ్యామిలీ సర్టిఫికెట్‌పై ఈసీ స్పష్టత

- తెలంగాణ ఓటర్ల జాబితా సవరణలో కీలక పరిణామం
- ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ చెల్లదన్న ఎన్నికల సంఘం
- ఇది రేషన్ కార్డుతో సమానమని, రుజువుగా అంగీకరించలేమని స్పష్టత
- నోటీసులు అందుకున్న ఓటర్లు ఇతర పత్రాలు సమర్పించాలని సూచన




**నేటి శుభోదయ, హైదరాబాద్ :** తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా, 'ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్'ను గుర్తింపు పత్రంగా అంగీకరించబోమని కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) స్పష్టం చేసింది. ఈ సర్టిఫికెట్ల జారీపై గత కొంతకాలంగా నెలకొన్న గందరగోళానికి ఈసీఐ తాజా ప్రకటనతో తెరపడింది. రేషన్ కార్డు (ఆహార భద్రత కార్డు) డేటా ఆధారంగా తెలంగాణ ప్రభుత్వం జారీ చేస్తున్న ఈ సర్టిఫికెట్, రేషన్ కార్డుతో సమానమని ఎన్నికల సంఘం తన వివరణలో పేర్కొంది. ఓటర్ల పరిశీలన ప్రక్రియలో రేషన్ కార్డును ధ్రువీకరణ పత్రంగా పరిగణించనందున, ఈ సర్టిఫికెట్‌ను కూడా అంగీకరించలేమని తేల్చిచెప్పింది. మీసేవ కేంద్రాల ద్వారా ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్లను జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం జులై 25న ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. కుటుంబ యజమాని, సభ్యుల పేర్లు, వయసు, చిరునామా, ఆధార్ వివరాలతో కూడిన ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్‌ను ఓటర్ల జాబితా సవరణలో ఉపయోగించుకోవచ్చని తొలుత ప్రచారం జరిగింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 6 లక్షల మంది ఈ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు.

## 3 గంటల వరకు సభలో ఉంటా..

### - ప్రతిపక్షాలకు అమిత్ షా సవాల్

**మొదటిపేజీ తరువాయి..** పార్లమెంట్‌లో కొనసాగుతున్న ప్రతిష్టంభనకు తెరదించేందుకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రతిపక్షానికి కీలక ప్రతిపాదన చేశారు. ఏ ప్రశ్న అడిగినా సమాధానం ఇచ్చేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు సభలోనే ఉంటానని చెప్పారు. ఈ 24 గంటల్లో ప్రతిపక్షం లేవనెత్తే అంశాలపై చర్చకు సిద్ధమని స్పష్టం చేశారు. నీట్ విద్యార్థుల ఆందోళనలపై జరిగిన పోలీసు చర్యకు సంబంధించి అమిత్ షా ప్రకటన చేయాలని ప్రతిపక్షం డిమాండ్ చేస్తోంది. అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియోగంపై కూడా చర్చ కోరుతోంది. ఈ డిమాండ్లతో పార్లమెంట్‌లో కార్యకలాపాలు స్తంభించాయి. చర్చకు సిద్ధంగా ఉంటే అధికారికంగా లేఖ ఇవ్వాలని అమిత్ షా ప్రతిపక్షాన్ని కోరారు. “లేఖ రాసి ఇవ్వండి. ఇవాళ మధ్యాహ్నం 3 గంటల నుంచి చర్చిద్దాం. రేపు మధ్యాహ్నం 3 గంటల వరకు చర్చించేందుకు నేను సిద్ధంగా ఉన్నాను” అని చెప్పారు. తిపక్షం అడిగే ప్రతి ప్రశ్నకు సమాధానం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నానని అమిత్ షా స్పష్టం చేశారు. చర్చ జరగాలా? సభను కొనసాగకుండా అడ్డుకోవాలా? అన్నది ఇప్పుడు ప్రతిపక్షమే నిర్ణయించుకోవాలని అన్నారు. పార్లమెంట్‌కు తాను రావడం లేదంటూ ప్రతిపక్షం చేస్తున్న విమర్శలను కూడా షా ఖండించారు. వర్షాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి తాను క్రమం తప్పకుండా సభకు హాజరవుతున్నానని చెప్పారు. పార్లమెంట్ కార్యకలాపాలను అడ్డుకుంటున్నది ప్రతిపక్షమేనని అమిత్ షా ఆరోపించారు. సభకు వచ్చి పదేపదే కార్యకలాపాలను అడ్డుకుంటే ప్రయోజనం ఏంటని ప్రశ్నించారు. నీట్ ఆందోళనలపై చర్చకు ప్రభుత్వం ఇప్పటికే అంగీకరించిందని చెప్పారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు కూడా ఈ అంశంపై అన్ని విషయాలు చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారని గుర్తుచేశారు. “చర్చకు వారు సిద్ధంగా లేరు. ఇప్పుడు ఎవరు పారిపోతున్నారో ప్రజలే నిర్ణయించాలి” అని షా వ్యాఖ్యానించారు.

## మేం 'టీ-హబ్' కడితే.. రేవంత్ 'అనుముల హబ్' కడుతున్నారు : కేటీఆర్

**మొదటిపేజీ తరువాయి..** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన సోదరుడు అనుముల కొండల్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు తన విమర్శల దాడిని మరింత ఉద్ధృతం చేశారు. సీఎం సోదరుడికి సంబంధముందని ఆరోపిస్తున్న టెస్సారక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు భూ కేటాయింపుల విషయంలో రూ. 200 కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపిస్తూ, సీఎం రేవంత్ రెడ్డి 'అనుముల హబ్స్' ఏర్పాటులో బిజీగా ఉన్నారని ఆయన ఎద్దేవా చేశారు. బుధవారం ఈ అంశంపై ‘ఎక్స్’ (ట్విట్టర్) వేదికగా కేటీఆర్ స్పందించారు. "తాము నిజమైన స్టార్టప్‌ల అభివృద్ధి కోసం టీ–హబ్ నిర్మిస్తే, రేవంత్ రెడ్డి మాత్రం కుటుంబ సభ్యులతో నడిచే, సున్నా ఆవిష్కరణలు, సున్నా ఉద్యోగులతో కూడిన స్కామ్.. అదేనండీ స్కీమ్ అయిన 'అనుముల హబ్స్' సృష్టిస్తున్నారు. అనుముల సోదరుల్లో ఒకరైతే చాలు, ఎలాంటి ప్రశ్నలు లేకుండా చౌక ధరకే ప్రభుత్వ భూమిని కేటాయిస్తారు. సున్నా పెట్టుబడితో రాత్రికి రాత్రే రూ. 200 కోట్లు సంపాదించినందుకు అనుముల కొండల్ రెడ్డిని 'శతాబ్దపు ఆవిష్కర్త'గా ప్రకటించాలి" అని కేటీఆర్ తన పోస్టులో పేర్కొన్నారు. కేవలం రూ. లక్ష చెల్లింపు మూలధనం, సున్నా ఉద్యోగులు ఉన్న కంపెనీకి అత్యంత విలువైన ప్రభుత్వ భూమిని ఎలా కేటాయిస్తారని ఆయన ప్రశ్నించారు. సుమారు రూ. 200 కోట్ల విలువైన ఐదు ఎకరాల భూమిని కేవలం రూ. 7 కోట్లకే, అంటే గజం రూ. 3,700 చొప్పున కట్టబెట్టారని కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వ భూముల నుంచి కోట్లాది రూపాయలు సంపాదించే ఈ మ్యాజిక్ ట్రిక్‌ను కేవలం అనుముల కుటుంబానికే పరిమితం చేయకుండా తెలంగాణ యువతకు కూడా నేర్పించాలని మంత్రి శ్రీధర్ బాబు, సీఎం రేవంత్ రెడ్డిలను ఉద్దేశించి అన్నారు. టెస్సారక్ట్ సంస్థతో సీఎం సోదరుడికి ఎలాంటి సంబంధం లేదని మంత్రి శ్రీధర్ బాబు చేసిన ప్రకటనను కేటీఆర్ తప్పుబట్టారు. కొండల్ రెడ్డి లింక్డ్ఇన్ ప్రొఫైల్‌లో, యూఎస్–ఇండియా స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ ఫోరమ్‌లో ఆయన్ను టెస్సారక్ట్ ఛైర్మన్‌గా గుర్తించిన విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. ఈ భూ కేటాయింపులకు సంబంధించిన జీవో, భూమి విలువ, అర్హత ప్రమాణాలు, పెట్టుబడి ప్రతిపాదనలు వంటి అన్ని పత్రాలను ప్రభుత్వం వెంటనే బయటపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ భూ కేటాయింపుల వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని, దీనిపై ముందుగా గవర్నర్‌కు ఫిర్యాదు చేసి, అవసరమైతే లోకాయుక్తను, న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. వాస్తవాలు వెలుగులోకి వచ్చి, బాధ్యులను శిక్షించే వరకు ఈ అంశాన్ని వదిలిపెట్టబోమని ఆయన స్పష్టం చేశారు.

## ఆపరేషన్ సిందూర్ తర్వాత మారిన పాక్ వ్యూహం..

### - ఉగ్ర సంస్థలపై ఐఎస్ఐ పట్టు

**మొదటిపేజీ తరువాయి..** బ్రిగేడియర్ ఇక్బాల్, కల్నల్ ఒవైజ్ అనే ఇద్దరు ఐఎస్ఐ అధికారులు మూడు సంస్థల కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించారు. వారి అనుమతి తర్వాతే కీలక చర్యలు ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. చొరబాట్ల విషయంలోనూ ఐఎస్ఐ కొత్త విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో ఐదారుగురు ఉగ్రవాదులు కలిసి చొరబడేందుకు ప్రయత్నించేవారు. ఇప్పుడు ముగ్గురితో కూడిన బృందాలను పంపుతున్నట్లు అధికారులు తెలిపారు. లష్కర్, జైష్, హిజ్బుల్ నుంచి ఒక్కొక్కరు ఉండేలా బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. నియంత్రణ రేఖ అవతల 500 మందికిపైగా ఉగ్రవాదులు భారత్‌లోకి చొరబడేందుకు సిద్ధంగా ఉన్నట్లు నిఘా సంస్థలు గతంలో గుర్తించాయి. మరోవైపు జమ్మూకశ్మీర్‌లో స్థానిక యువతను ఆకర్షించేందుకు ఐఎస్ఐ ప్రయత్నిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఆఫ్ఘనిస్థాన్, ఆఫ్రికాలో ఉన్న నెట్‌వర్క్‌ల ద్వారా యువతను ప్రభావితం చేసే ప్రయత్నాలు జరుగుతున్నట్లు చెప్పారు. ఎంపికైన యువతకు ఒంటరిగా దాడులు చేయడం, స్థానిక వస్తువులతో ఐఈడీల తయారీపై శిక్షణ ఇచ్చే అవకాశం ఉందని అధికారులు వివరించారు. దాడులకు పాకిస్థాన్ సంబంధం బయటపడకుండా జాగ్రత్త పడటమే ఈ వ్యూహం వెనుక ఉద్దేశమని తెలిపారు. ఉగ్ర సంస్థలపై నేరుగా నియంత్రణ తీసుకోవడం ద్వారా కార్యకలాపాల్లో సమన్వయం పెంచాలని ఐఎస్ఐ ప్రయత్నిస్తున్నట్లు నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## జెన్-జీకి ప్రధాని నరేంద్రమోదీ కీలక సూచన

**మొదటిపేజీ తరువాయి..** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేటి తరం యువతకు (జెన్–జీ) పలు కీలక సూచనలు చేశారు. జీవితంలో అడ్డదారుల వెంట పడొద్దని, అవి అంతిమంగా తీవ్ర నష్టాలకే దారితీస్తాయని ఆయన హెచ్చరించారు. అదే సమయంలో, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, రీల్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బుధవారం నాడు ఢిల్లీలో మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆత్మకథ 'ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్: మై లైఫ్, మై స్ట్రగుల్స్' ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. రైల్వే స్టేషన్లలో తరచూ కనిపించే ఒక హెచ్చరికను ప్రధాని ఈ సందర్భంగా గుర్తుచేశారు. "షార్ట్‌కట్ విల్ కట్ యు షార్ట్" (అడ్డదారి మీ జీవితాన్ని కుదిస్తుంది) అనే బోర్డు కేవలం రైల్వే ట్రాక్‌లకే కాకుండా, నిజ జీవితానికి కూడా వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు అందుబాటులో ఉన్నప్పటికీ, త్వరగా వెళ్లాలనే తొందరలో కొందరు ప్రమాదకరంగా పట్టాలు దాటుతుంటారని, అటువంటి అనాలోచిత నిర్ణయాలు ప్రాణాంతకమని ఆయన హెచ్చరించారు. యువత తప్పుడు మార్గాలను వీడి, అర్థవంతమైన జీవన గమనాన్ని ఎంచుకోవాలని ప్రధాని మోదీ సూచించారు. "మీరు ఆరాధించే మహనీయుల జీవిత చరిత్రలను తప్పనిసరిగా చదవండి. వాటి ద్వారా స్ఫూర్తి పొంది సరైన మార్గాన్ని కనుగొనవచ్చు" అని ఆయన యువతకు సలహా ఇచ్చారు. ముఖ్యంగా ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేసే ఇన్‌ఫ్లుయెన్సర్ల కంటెంట్ పట్ల నిరంతరం జాగ్రత్తగా ఉండాలని ఆయన హితవు పలికారు.

## ఆసుపత్రుల రూమ్ చార్జీలకు పరిమితి..

### - పార్లమెంటరీ కమిటీ కీలక సిఫార్సు

**మొదటిపేజీ తరువాయి..** దేశంలోని మెట్రో నగరాల్లో ప్రైవేటు ఆసుపత్రులు వసూలు చేస్తున్న గది అద్దెలకు పరిమితి విధించాలని పార్లమెంటరీ స్థాయీ సంఘం సిఫార్సు చేసింది. ఆయా ఆసుపత్రుల సమీపంలోని 3–స్టార్ హోటళ్ల సగటు అద్దె కంటే ఈ ఛార్జీలు అధికంగా ఉండకూడదని స్పష్టం చేసింది. పెరుగుతున్న వైద్య ఖర్చులను అదుపులోకి తీసుకువచ్చి, రోగులపై పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించడమే లక్ష్యంగా కమిటీ ఈ కీలక సూచనలు చేసింది. ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖకు సంబంధించిన పార్లమెంటరీ స్థాయీ సంఘం తన 176వ నివేదికలో ఈ సిఫార్సులను పొందుపరిచింది. 'ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఆరోగ్య సంరక్షణ సౌకర్యాల అందుబాటు–స్తోమత' పేరిట రూపొందించిన ఈ నివేదికను ఆగస్టు 7న పార్లమెంటు ఉభయ సభల్లో ప్రవేశపెట్టారు. ఆసుపత్రుల్లోని మౌలిక సదుపాయాలు, సేవలను బట్టి గది అద్దెల్లో భారీ వ్యత్యాసాలు ఉన్నాయని, తక్షణమే వీటిని హేతుబద్ధీకరించాలని కమిటీ సూచించింది. ఈ నిబంధన కేవలం ప్రాథమిక గది అద్దెకే వర్తిస్తుందని, రెసిడెంట్ డాక్టర్, నర్సింగ్, భోజనం ఖర్చులను ఆసుపత్రులు అదనంగా వసూలు చేసుకోవచ్చని స్పష్టం చేసింది. జాతీయ నమూనా సర్వే (2025) గణాంకాలను కమిటీ ఈ సందర్భంగా ఉటంకించింది. ప్రభుత్వ ఆసుపత్రిలో సగటు చికిత్స వ్యయం రూ. 6,631గా ఉండగా, ప్రైవేటు ఆసుపత్రుల్లో అది రూ. 50,508గా ఉందని పేర్కొంది. ఉదాహరణకు, ముంబైలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో సింగిల్ రూమ్ అద్దె రోజుకు రూ. 6,000 నుంచి రూ. 12,000 వరకు ఉండగా, సమీపంలోని 3–స్టార్ హోటళ్లలో అది రూ. 2,500 నుంచి రూ. 4,500 మధ్యే ఉందని నివేదికలో వివరించింది. గది అద్దెలతో పాటు ప్రైవేటు ఆసుపత్రులలోని కీలక చికిత్సలు, వ్యాధి నిర్ధారణ పరీక్షల ధరలను కూడా నియంత్రించేలా ఒక చట్టబద్ధమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని కమిటీ సిఫార్సు చేసింది. చికిత్స ప్రారంభించడానికి ముందే అంచనా వ్యయాన్ని రోగులకు వివరించాలని సూచించింది. అయితే, హోటళ్లతో ఆసుపత్రులను పోల్చడం సరి కాదని, ఆసుపత్రుల్లోని వైద్య సేవలు, సిబ్బంది, మౌలిక సదుపాయాలు హోటళ్లతో పోలిస్తే భిన్నంగా ఉంటాయని కొన్ని ఆసుపత్రుల యాజమాన్యాలు అభిప్రాయపడ్డాయి. ప్రస్తుతం ఇవి సలహా పూర్వక సిఫార్సులు మాత్రమే కాగా, వీటి అమలు కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది.

## తెలంగాణలో సగం డిగ్రీ కాలేజీలకు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాళ్లే!

**మొదటిపేజీ తరువాయి..**
తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో దాదాపు సగం వరకు రెగ్యులర్ ప్రిన్సిపాళ్లు లేకుండానే కొనసాగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 159 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 75 చోట్ల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాళ్లే బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని 'క్వాలిఫైడ్ గవర్నమెంట్ డిగ్రీ లెక్చరర్స్ అసోసియేషన్' వెల్లడించింది. ప్రిన్సిపాల్ పోస్టులు ఖాళీగా ఉండటం వల్ల దైనందిన పరిపాలనతో పాటు ప్రవేశాలు, విద్యాపరమైన పర్యవేక్షణపై తీవ్ర ప్రభావం పడుతోందని అధ్యాపకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ఒక్కో ప్రిన్సిపాల్ రెండు, మూడు కళాశాలల అదనపు బాధ్యతలు నిర్వహించాల్సి వస్తోందని, దీనివల్ల ఏ ఒక్క కళాశాలపై కూడా పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించలేకపోతున్నారని వారు పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రవేశాలు, పరీక్షల సమయంలో ధ్రువపత్రాలు, ఉపకారవేతనాలు, హాజరు వంటి అంశాల్లో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. అధ్యాపకుల నియామకాలు, పదోన్నతుల్లో ఏళ్లుగా పరిష్కారం కాని సమస్యలే ఈ ఖాళీలకు ప్రధాన కారణంగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం 151 మంది అర్హులైన అధ్యాపకులు పదోన్నతుల కోసం నిరీక్షిస్తున్నారు. వివిధ బ్యాచ్‌ల సీనియారిటీ జాబితాలపై నెలకొన్న వివాదమే ఈ ప్రక్రియకు అడ్డంకిగా మారింది. 1998 బ్యాచ్‌కు చెందిన జూనియర్ అధ్యాపకులను, తర్వాత కాలంలో వచ్చిన 2001, 2002, 2004, 2005 బ్యాచ్‌ల కంటే సీనియర్లుగా గుర్తించాలని అసోసియేషన్ డిమాండ్ చేస్తోంది. ఈ అంశంపై అసోసియేషన్ అధ్యక్షుడు, ఇంగ్లీష్ అసోసియేట్ ప్రొఫెసర్ టి.ఎస్. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, నిబంధనల ప్రకారం అత్యంత పారదర్శకంగా ఈ 75 ప్రిన్సిపాల్ పోస్టులను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. తద్వారా కళాశాలల పరిపాలన మెరుగుపడటంతో పాటు, పదవీ విరమణకు చేరువలో ఉన్న సీనియర్ అధ్యాపకులకు సముచిత గౌరవం, అవకాశం లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

## రాజ్యసభను కుదిపేసిన "లుంగీవాలా" వివాదం

- **తనను లుంగీవాలా అని పిలిచారంటూ బీజేపీ ఎంపీపై సీపీఎం ఎంపీ ఫిర్యాదు**
- **ఆ వ్యాఖ్యలు తాను చేయలేదని, బ్రిట్టాస్ అబద్ధం చెబుతున్నారని సుస్మితా దేవ్ ఖండన**
- **ఒకరిపై మరొకరు హక్కుల ఉల్లంఘన నోటీసులు దాఖలు**



**నేటి శుభోదయ, న్యూ ఢిల్లీ :** రాజ్యసభలో బుధవారం 'లుంగీవాలా' వివాదం తీవ్ర దుమారం రేపింది. తనను ఉద్దేశించి బీజేపీ ఎంపీ సుస్మితా దేవ్ ఈ పదాన్ని ఉపయోగించారని కేరళకు చెందిన సీపీఎం సభ్యుడు జాన్ బ్రిట్టాస్ ఆరోపించడంతో సభలో గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలో చైర్మన్ సి.పి. రాధాకృష్ణన్ సభను మధ్యాహ్నానికి వాయిదా వేశారు. సోమవారం నాడు సభలో తాను ఆదాయపు పన్ను సవరణ ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా తీర్మానాన్ని ప్రవేశపెడుతున్న సమయంలో, పంచె కట్టుకుని ఉన్న తనను చూసి వెనుక సీటులో కూర్చున్న సుస్మితా దేవ్ పదేపదే 'లుంగీవాలా' అని సంబోధించారని బ్రిట్టాస్ సభ దృష్టికి తీసుకొచ్చారు. ఇది దక్షిణాది సంస్కృతిని, మలయాళీలను అవమానించడమేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను గర్వించదగ్గ భారతీయుడినని, దక్షిణాది వాడినని పేర్కొంటూ, ఈ వ్యాఖ్యలపై సుస్మితా దేవ్‌పై హక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చినట్లు వెల్లడించారు. ఈ ఆరోపణలను సుస్మితా దేవ్ తీవ్రంగా ఖండించారు. తాను అసోంకు చెందిన బెంగాలీనని, వివిధ రాష్ట్రాల వస్త్రధారణ పట్ల తనకు అపారమైన గౌరవం ఉందని స్పష్టం చేశారు. బ్రిట్టాస్ అసత్యాలు చెబుతున్నారని, ఏ విచారణలోనైనా వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఆమె పేర్కొన్నారు. అంతేకాకుండా, మతపరమైన గుర్తింపులపై బ్రిట్టాస్ అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఆయనపై ఆమె కూడా ప్రివిలేజ్ నోటీసు దాఖలు చేశారు. ఈ వివాదంపై ప్రతిపక్షాలు తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. కొందరు ఎంపీలు పార్లమెంట్ వెలుపల పంచెకట్టుతో నిరసన తెలిపారు. సభా నాయకుడు జె.పి. నడ్డా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు జోక్యం చేసుకుని, సభా మర్యాదలను కాపాడాలని సభ్యులను కోరారు. సభ్యులు ఒకరి సాంస్కృతిక సంప్రదాయాలను కించపరిచేలా వ్యాఖ్యలు చేయవద్దని సూచించిన చైర్మన్, ఇరుపక్షాలను తన ఛాంబర్‌కు పిలిచి సమస్య పరిష్కారానికి ప్రయత్నించారు. ప్రస్తుతం ఇరుపక్షాలు అందజేసిన హక్కుల ఉల్లంఘన నోటీసులు చైర్మన్ పరిశీలనలో ఉన్నాయి.

# కూకట్‌పల్లి - ఐడీపీఎల్ రోడ్డుపై దుమ్ము దుమారం

## - రోడ్డు బాగు చేయరా..? ప్రజల ప్రాణాలతో చెలగాటమా!

**కూకట్పల్లి, ఆగస్టు 12, నేటి శుభోదయ :** నగరంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో ఒకటైన కూకట్‌పల్లి–ఐడీపీఎల్ ప్రధాన రహదారి ప్రస్తుతం వాహనదారులు, పాదచారులకు నరకయాతనగా మారింది. రహదారిపై మట్టి, రాళ్లు పేరుకుపోవడంతో వాహనాలు రాకపోకలు సాగించే సమయంలో భారీగా దుమ్ము లేస్తోంది.దుమ్ముతో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలురహదారి మొత్తం మట్టి, రాళ్లతో నిండిపోవడంతో వాహనాలు వెళ్లే ప్రతిసారీ దుమ్ము దట్టంగా పైకి లేస్తోంది. దీంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుమ్ము కారణంగా ఎదురుగా వస్తున్న వాహనాలు సైతం స్పష్టంగా కనిపించకపోవడంతో ప్రమాదాల ముప్పు పొంచి ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ మార్గంలో ఒకవైపు భారీ అపార్ట్‌మెంట్ నిర్మాణాలు కొనసాగుతుండగా, మరోవైపు నిత్యం భారీగా వాహనాల రాకపోకలు జరుగుతున్నాయి. ఇలాంటి రద్దీ ప్రాంతంలో రోడ్డు పనులు కొనసాగుతుండటంతో పరిస్థితి మరింత దారుణంగా మారింది. కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు దుమ్మును లేపుతూ వెళ్లే దృశ్యాలు సమస్య తీవ్రతను తెలియజేస్తున్నాయి.అధికారులు స్పందించాలి ప్రధాన రహదారి కావడంతో ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. రహదారిపై దుమ్ము నియంత్రణకు క్రమం తప్పకుండా నీటిని చల్లడంతో పాటు, రోడ్డు పనులను వేగవంతం చేసి ప్రయాణానికి అనుకూలంగా మార్చాలని డిమాండ్ చేస్తున్నారు.ప్రజలకు నిత్య ప్రయాణ మార్గంగా ఉన్న కూకట్‌పల్లి–ఐడీపీఎల్ రహదారి దుస్థితిపై అధికారులు ఇకనైనా దృష్టి సారించి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు. ఈ



రహదారి ఎప్పుడు పూర్తిస్థాయి సౌకర్యవంతమైన రహదారిగా మారుతుందో వేచి చూడాల్సిందే!

# రాజకీయ డ్రామాలు వద్దు - నెమలికొండ వేణుమాధవ్



**సంగారెడ్డి, ఆగస్టు 12, నేటి శుభోదయ :** జిల్లాలో కాంగ్రెస్ బిఆర్ఎస్ పార్టీలు రాజకీయ డ్రామాలు మానుకోవాలని తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకులు, జహీరాబాద్ పార్లమెంట్ ఇంచార్జి నెమలికొండ వేణుమాధవ్ సూచించారు. మంగళవారం ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి,ఎస్టీ సెల్ రాష్ట్ర నాయకుడు శంకర్ నాయక్ లతో కలిసి ఆయన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. మాజీ మంత్రి హరీష్ రావు పై జగ్గారెడ్డి పై సంగారెడ్డి శాసనసభ్యులు చింత ప్రభాకర్ ఆరోపణలు విడ్డూరంగా ఉన్నాయన్నారు. గత మూడు దశాబ్దాలుగా సంగారెడ్డి సదాశివపేట ప్రాంతంలో చింతా ప్రభాకర్ జగ్గారెడ్డిలు మున్సిపల్ చైర్మన్గా శాసనసభ్యులు గా అధికారాన్ని పంచుకున్నారన్నారు. గడచిన 30 ఏళ్లుగా ప్రజా సమస్యలు పక్కనపెట్టి వ్యక్తిగత ఆస్తులను పెంచుకోవడంపైనే దృష్టి పెట్టారని విమర్శించారు ప్రభుత్వ భూములకు కబ్జాలు అధికార దుర్వినియోగం తప్ప ప్రజలకు ఒరగబెట్టింది ఏమీ లేదన్నారు. పోతిరెడ్డిపల్లి లో బస్టాండ్ సదాశివపేటలో సబ్ కోర్టు లాంటి అనేక అంశాలు తీరని కోరికలుగా మిగిలాయి అన్నారు జిల్లాలో ఉన్న జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాలు విపరీతంగా పెరుగుతున్నాయన్నారు వందలాదిమంది రోడ్డుల రోడ్డు ప్రమాదాల ప్రమాదాల్లో మరణిస్తున్నారని వేలాదిమంది క్షతగాత్రులు అవుతున్నారని అన్నారు. జాతీయ రహదారులు అభివృద్ధికి సూచికగా ఉండాలి తప్ప నరకానికి మార్గంగా ఉండొద్దని పేర్కొన్నారు నేషనల్ అథారిటీ జాతీయ రహదారి అంశంలో పూర్తి నిర్లక్ష్యం వహిస్తున్నారు అన్నారు. ప్రమాద సూచికలు లేకుండా సర్వీస్ రోడ్లను ఏర్పాటు చేయకుండా యూటర్న్ ల వద్ద హైమాస్ లైట్ లు ఏర్పాటు చేయకుండా ప్రజల ప్రాణాలను గాలికి వదిలేస్తున్నారన్నారు ప్రభుత్వం వెంటనే అత్యవసరంగా సంగారెడ్డి జిల్లాలో రోడ్డు ప్రమాదాలపై సమీక్ష జరపాలన్నారు సంవత్సరాల కాలంగా టోల్ ట్యాక్స్ వసూలు చేస్తున్నప్పటికీ అధ్వాన్నమైన రోడ్డు వసతుల కల్పన లోపం కనబడుతుంది అన్నారు.ఈ నెల 15న ముఖ్యమంత్రి పర్యటన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా మంజీరా జలాలు సంగారెడ్డి జిల్లా ప్రజలకు దక్కాలని డిమాండ్ చేశారు. సంగారెడ్డి జిల్లా ప్రజలకు తాగునీరు దక్కకుండా హైదరాబాద్ ప్రాంతానికి మంజీరా జరాల్ తరలిస్తే జిల్లా ప్రజలు ఊరుకోరని హెచ్చరించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా మంజీరా జరాల మంజీరా జరాలపై స్పష్టత ఇవ్వాలని వేణుమాధవ్ డిమాండ్ చేశారు. గడిచిన దశాబ్దాలగా సంగారెడ్డి ప్రాంతానికి జగ్గారెడ్డి చింత ప్రభాకర్ చేసింది తక్కువ చెప్పుకున్నది ఎక్కువ అని ఎద్దేవా చేశారు సంగారెడ్డి జహీరాబాద్,ఆందోల్, సదాశిపేట మున్సిపాలిటీలో డంపింగ్ యార్డ్ ట్రీట్మెంట్ ప్లాట్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.డంపింగ్ యార్డ్ లో డంపింగ్ యార్డ్ లో ప్రమాణాలు పాటించక రీ ట్రీట్మెంట్ ప్లాన్స్ లేక క్యాన్సర్ రోగానికి కారణం అవుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలంలో డంపింగ్ యార్డ్ లోని కాలుష్యం కాలుష్యం అంతా దగ్గర్లో ఉన్న చెరువుల ద్వారా మంజీరా నదిలో కలవడం జిల్లా ప్రజల అనారోగ్యానికి కారణమవుతున్నదని పేర్కొన్నారు రానున్న రోజుల్లో తెలంగాణ రక్షణ సేన కవిత గారి నాయకత్వంలో జిల్లాలో గ్రామ గ్రామాన ప్రజల గొంతుకగా నిలుస్తామని ప్రజా సమస్యలపై ఆందోళన నిర్వహిస్తామని వేణుమాధవ్ పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ సంగారెడ్డి మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ ఎం శ్రీనివాస్ రెడ్డి జిల్లా టిఆర్ఎస్ నాయకులు శంకర్ నాయక్ బసవరాజ్ నర్సింలు యశ్వంత్ విశాల్ తదితరులు పాల్గొన్నారు.

# గిన్నిస్ రికార్డు సాధించిన ఆదివాసీ యువకుడికి ఘన సన్మానం...

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 12, నేటి శుభోదయ :** గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో నమోదైన అతిపెద్ద కరాటే ప్రదర్శనలో భాగస్వామిగా నిలిచిన భద్రాచలానికి చెందిన ఆదివాసీ యువకుడు చర్ప రాంబాబును డిపో యూత్ ఆధ్వర్యంలో







ఘనంగా సన్మానించారు.హైదరాబాద్‌లో ఏప్రిల్ 25న నిర్వహించిన అతిపెద్ద కరాటే ప్రదర్శనలో 1,212 మంది పాల్గొన్నారు. విజన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ, జె.ఆర్. ఇంటర్నేషనల్ తైక్వాండో అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో నమోదైంది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రదర్శనలో చర్ప రాంబాబు పాల్గొని రికార్డు సాధనలో భాగస్వామిగా నిలిచారు.ప్రస్తుతం రాంబాబు మైనారిటీ గురుకుల పాఠశాలలో పీఈటీగా విధులు నిర్వహిస్తూ, డిపో యూత్ సభ్యుడిగా కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా డిపో యూత్ సభ్యులు ఆయనను శాలువాతో సత్కరించి, మెమెంటో అందజేసి అభినందించారు.ఆదివాసీ యువకుడిగా క్రీడా రంగంలో



ప్రతిభను చాటుతూ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. రాంబాబు విజయం భద్రాచలం ప్రాంత యువతకు, ముఖ్యంగా ఆదివాసీ యువతకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. క్రమశిక్షణ, పట్టుదలతో కృషి చేస్తే యువత క్రీడలు సహా వివిధ రంగాల్లో అంతర్జాతీయ స్థాయిలో రాణించవచ్చన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా సంతోష్, టీయూడబ్ల్యూజే భద్రాచలం పట్టణ అధ్యక్షుడు విజ్జగిరి రాజా కిరణ్, డిపో యూత్ సభ్యులు పండా అమృతరావు (అంబు), తాళ్ల నాగరాజు, శీలం నాగరాజు, తాళ్ల శివ, కారం రవితేజ, డిపో సత్తి, ప్రసాద్ తదితరులు పాల్గొని రాంబాబుకు అభినందనలు తెలిపారు.

# ఎయిడ్స్ పై రెండు నెలల పాటు అవగాహన కార్యక్రమం



**నిజామాబాద్, ఆగస్టు 12, నేటి శుభోదయ :** జిల్లా వైద్య ఆరోగ్యశాఖలోని ఎయిడ్స్ విభాగం ఆధ్వర్యంలో రెండు నెలల పాటు జరిగే అవగాహన కార్యక్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు భుజంగరావు బుధవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవితాన్ని కలిగి ఉండాలిఅని అన్నారు.ఈ రోజు నిజామాబాద్ జిల్లా కేంద్రంలో అదనపు కలెక్టర్ ఛాంబర్ లో ఎయిడ్స్ పై ఐఐఈసీ తీవ్రతరమైన విజ్ఞాన సమాచారం– అవగాహన కార్యక్రమాన్ని డిఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ తో పాటు తమ ప్రమాదకర పరిస్థితిని తెలుసుకునే క్యూఆర్ కోడ్ (Break free aap)పోస్టర్ ను ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ....ప్రభుత్వ ఆదేశానుసారం హెచ్ఐవి ఎయిడ్స్ నివారణలో భాగంగా...ఈ విస్తృత ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు.ప్రతి ఒక్కరు ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని ఎటువంటి వ్యాధులు రాకుండా జాగ్రత్త పడాలని అన్నారు.జిల్లాలో ఈ కార్యక్రమం రెండు నెలల పాటు కొనసాగుతుందని అన్నారు.డా.రాజశ్రీ మాట్లాడుతూ..ఈ కార్యక్రమము ఈరోజు నుండి రెండు నెలల పాటు జిల్లాలో కొనసాగుతుందని ఇందులో భాగంగా 200 కళాశాల మరియు పాఠశాల విద్యార్థులకు,200 ఎంపిక చేసిన గ్రామాలలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుంది.అలాగే దీనిపై జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరుగుతుంది.అలాగే యువత అవగాహన కొరకు బైక్ ర్యాలీని కూడా ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.కార్యక్రమంలో డా.దేవి నాగేశ్వరి టిబి నియంత్రణ అధికారి,డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ సికందర్ నాయక్,ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డాక్టర్ వెంకన్న,డాక్టర్ సుప్రియ,డాక్టర్ నవ్య హెల్త్ ఎడ్యుకేటర్ గన్పూర్ వెంకటేష్,డిపిఎం సుధాకర్, సిపిఓ మోహీజ్ అహ్మద్,సిఎస్ఓ నవీన్,స్నేహ సొసైటీ సిద్దయ్య,డిపిఓ విశాల,హెచ్ఈఓ గోవర్ధన్, నాగరాజు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, వివిధ స్వచ్ఛంద సంస్థలు స్నేహ సొసైటీ, వర్దు, పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా, వైఆర్జి నుండి సిబ్బంది పాల్గొన్నారు.

# ఆధునిక సాగు పద్ధతులతో రైతులకు ప్రయోజనం





**శామీర్‌పేట, ఆగస్టు 12, నేటి శుభోదయ :** ఆధునిక వ్యవసాయ పద్ధతులను పాటించడం ద్వారా రైతులు సాగు ఖర్చులను తగ్గించుకుని అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి రమేష్, అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి అన్నారు. రైతులు శాస్త్రీయ పద్ధతులపై అవగాహన పెంచుకుని వాటిని ఆచరణలో పెట్టాలని సూచించారు. అలియాబాద్ రైతు వేదికలో బుధవారం వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ–ఏటీఎంఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన రైతుల శిక్షణ కార్యక్రమంలో వారు మాట్లాడారు.ఈ సందర్భంగా నానో యూరియా వినియోగం, వరి కొయ్యలను కాల్చడం వల్ల కలిగే నష్టాలు, జీవ ఎరువుల ప్రాధాన్యం, ఎల్‌నినో ప్రభావాల నేపథ్యంలో పంట మార్పిడి విధానం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. వరి కొయ్యలను కాల్చడం వల్ల నేలలోని ఉపయోగకరమైన సూక్ష్మజీవులు నశించడంతోపాటు పర్యావరణానికి హాని కలుగుతుందని వివరించారు. జీవ ఎరువుల వినియోగంతో నేల సారాన్ని కాపాడుకోవచ్చని సూచించారు.కార్యక్రమంలో కౌన్సిలర్ జస్వంత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తునికి భిక్షపతి, మేడ్చల్–మల్కాజిగిరి ఉద్యానశాఖ అధికారి శ్రీధర్, రాజేంద్రనగర్ రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయ అధికారి కృష్ణవేణి, వ్యవసాయ విస్తరణ అధికారులు సుధీర్‌కుమార్, అర్చన, వనరుల వ్యక్తి మహమ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు. రైతులు ముద్దం సంజీవరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, పద్మమ్మ, హరిశంకర గౌడ్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి : ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**షాద్ నగర్, ఆగస్టు 12, నేటి శుభోదయ :** ఫరూఖ్‌నగర్ పరిషత్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిపై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. మొదటి దశలో మంజూరైన 3,500 ఇళ్లలో 1,866 ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉండగా, 948 ఇళ్లు పూర్తయ్యాయని అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. మరో 646 ఇళ్ల నిర్మాణ పనులు ఇంకా ప్రారంభం కాలేదని తెలిపారు.నిర్మాణం ప్రారంభం కాని ఇళ్లపై గ్రామాల వారీగా సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే, అతి త్వరలోనే అన్ని ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రస్తుతం మంజూరైన ఇళ్లు సరిపోవని, మరిన్ని ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓలు సమన్వయంతో క్షేత్రస్థాయిలో నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణం ప్రారంభించే సమయంలో పంచాయతీ కార్యదర్శులు, హౌసింగ్ ఏఈలు మార్కౌట్ ఇచ్చి, ప్రభుత్వ నిబంధనలను స్పష్టంగా వివరించాలని అన్నారు. నిబంధనలకు మించి ఇళ్ల విస్తీర్ణం పెంచి, అనంతరం బిల్లులు మంజూరు కాక ఇబ్బందులు పడే పరిస్థితి రాకుండా ముందస్తు అవగాహన కల్పించాలని సూచించారు.పైలట్ ప్రాజెక్ట్ గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న బిల్లులను త్వరలో మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సమావేశంలో హౌసింగ్ అధికారులు, ఏఈలు, కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కేశంపేటలో భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం



**కేశంపేట, ఆగస్టు 12, నేటి శుభోదయ :** కేశంపేట గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఆషాఢ మాసం అమావాస్య చివరి రోజును పురస్కరించుకుని, శ్రావణ మాసంలోకి అడుగుపెడుతున్న శుభతరుణంలో 40 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురుబోధ రంగదాసు ఆధ్వర్యంలో కిషన్ ప్రభు ధర్మ ప్రచార సమితి కార్యకర్తలు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా హనుమంతుడి నామస్మరణతో పరిసరాలు మార్మోగాయి. భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసాను పారాయణం చేశారు. ముఖ్యంగా మహిళా కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. పారాయణంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమానికి గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు, ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు. అన్నదాత మెడికల్ షాప్ పాండు స్వామి, గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు, సర్పంచ్, కిషన్ ప్రభు ధర్మ ప్రచార సమితి కార్యకర్తలు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. శ్రావణ మాసం ప్రారంభ సందర్భంగా భక్తులు హనుమంతుడి ఆశీస్సులు పొందాలని, గ్రామంలో సుఖశాంతులు నెలకొనాలని ఆకాంక్షించారు.

## దివ్యాంగుల సంక్షేమంపై కేంద్ర మంత్రితో ఎంపీ అర్వింద్ భేటీ

**నిజామాబాద్, ఆగస్టు 12, నేటి శుభోదయ :** నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి కేంద్ర సామాజిక న్యాయం,సాధికారత శాఖ మంత్రి డా.వీరేంద్ర కుమార్‌ను న్యూఢిల్లీలో కలి–శారు. నియోజకవర్గంలోని దివ్యాంగుల సంక్షేమం, సాధికారతపై చేపట్టాల్సిన చర్య–లపై చర్చించారు. దివ్యాంగుల సమస్యలు, సంక్షేమ పథకాలు, సహాయక పరికరాల పంపిణీ, ప్రభుత్వ సేవల సులభతపై ఎంపీ వివరించారు.వీల్‌చైర్లు,వినికిడి పరికరాలు, కృత్రిమ అవయవాల కోసం అంచనా శిబిరాలు విస్తరించాలని కోరారు. విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు పెంచ–డంతో పాటు ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు,ప్రజా ప్రదేశాల్లో అందుబాటు సౌకర్యాలు మెరుగుపరచాలని విజ్ఞప్తి చేశారు.నియోజకవర్గంలో కేంద్ర పథకాలు అర్హులందరికీ చేరేలా పని చేస్తున్నామని ఎంపీ తెలిపారు.సహకారానికి కేంద్ర మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.ఎంపీ విజ్ఞప్తులపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందిస్తూ దివ్యాంగుల సంక్షేమానికి అవసరమైన పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.



## కేజీబీవీ, రెసిడెన్షియల్ స్కూళ్లను సందర్శించిన కలెక్టర్

**నిజామాబాద్, ఆగస్టు 12, నేటి శుభోదయ :** ఎడపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ మైనార్టీ బాలికల విద్యాలయాన్ని,తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్,జూనియర్ కళాశాలలను కలెక్టర్ భవేష్ మిశ్రా బుధవారం సందర్శించారు.పాఠశాలల పరిసరాలను,కిచెన్,స్టోర్ రూమ్,తరగతి గదులను పరిశీలించారు.కేజీబీవీ పరిసరాలు పిచ్చి మొక్కలతో నిండి అపరిశుభ్రంగా ఉండడాన్ని గమనించిన కలెక్టర్,వెంటనే పరిసరాలను శుభ్రం చేయించాలని,వర్షపు నీరు నిలువ ఉండకుండా చూడాలని అన్నారు.సువిశాలమైన ఖాళీ స్థలం అందుబాటులో ఉన్నందున అన్ని వసతులతోకూడిన క్రీడా మైదానంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను తనిఖీ చేసి, మెనూ వివరాలు అడిగి తెలుసుకున్నారు.ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టిక ఆహారాన్ని అందించాలని,పాఠశాలల ప్రవేశ మార్గంలో ప్రధాన ద్వారం వద్ద అందరికీ కనిపించేలా మెనూ బోర్డును ప్రదర్శించాలని నిర్వాహకులను ఆదేశించారు. కేజీబీవీ లో బాలికల సంఖ్య తక్కువగా ఉండడాన్ని గమనించిన కలెక్టర్,ఇతర విద్యార్థినులకు ప్రవేశాలు కల్పించే విషయమై సంబంధిత రాష్ట్ర స్థాయి అధికారులతో మాట్లాడతానని అన్నారు.పాఠశాలలో కొనసాగుతున్న ప్రహారీ గోడ నిర్మాణం పనుల నాణ్యతను పరిశీలించారు.ఆర్.ఓ వాటర్ ప్లాంట్ నిరుపయోగంగా ఉండడాన్ని గమనించిన కలెక్టర్,జిల్లా వ్యాప్తంగా గల అన్ని కేజీబీవీలలో ఆర్.ఓ ప్లాంట్లు,సోలార్ హీటర్లు వినియోగంలోకి తెచ్చేందుకు మరమ్మత్తులు చేయించాలని అధికారులను ఆదేశించారు.రెసిడెన్షియల్ కళాశాల ఆవరణలో వరి ధాన్యం,ఇతర కూరగాయలను సాగు చేస్తుండడాన్ని గమనించిన కలెక్టర్ నిర్వాహకులను అభినందించారు.బాలికల ఆరోగ్యాల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.





అనంతరం పదవ తరగతి క్లాస్ రూమ్ లను సందర్శించి,విద్యార్థినులకు ఆంగ్లం సబ్జెక్ట్ లో పాఠాలు బోధించారు.పలు ప్రశ్నలు వేస్తూ వారి అభ్యాసన సామర్థ్యాన్ని అంచనా వేశారు.తన వెంట తెచ్చిన బహుమతులను అందించారు. చక్కగా చదువుకోవాలని,తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తేవాలని విద్యార్థినులకు ప్రేరణ కల్పించారు. కలెక్టర్ వెంట స్థానిక తహసీల్దార్ దత్తాత్రి, ఎంఈఓ గాలప్ప, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ దీపిక,రెసిడెన్షియల్ స్కూల్ సహాయ ప్రిన్సిపాల్ సురేఖ తదితరులు ఉన్నారు.

## అవసరాల ఆధారిత కనీస వేతనాన్ని నిర్ణయించాలి

### - టియుసిఐ రాష్ట్ర అధ్యక్షులు కే.సూర్యం

**నిజామాబాద్, ఆగస్టు 12, నేటి శుభోదయ :** ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టియుసిఐ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కోటగల్లిలో ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షులు కే.సూర్యం మాట్లాడుతూ కనీస వేతనాల సమస్య దేశంలోని ప్రతి కార్మికుడిని ప్రభావితం చేస్తుందన్నారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నోటిఫై చేసిన చట్టబద్ధమైన కనీస వేతనాలు కార్మికులు,వారి కుటుంబాల వాస్తవ అవసరాలపై ఆధారపడి లేవన్నారు.తద్వారా లక్షలాది మంది కార్మికులు వారి కుటుంబ సభ్యులు గౌరవప్రద జీవన ప్రమాణాలను పొందలేకపోతున్నారన్నారు.చట్టబద్ధమైన కనీస వేతనం అనేది నిజమైన అవసరాల ఆధారిత కనీస వేతనంగా ఉండాలని టియుసిఐ డిమాండ్ చేస్తుందన్నారు.1957లో జరిగిన 15వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ నిర్దేశించిన శాస్త్రీయ నిబంధనలకు అనుగుణంగా, 1992లో సుప్రీంకోర్టు గుర్తించిన సూత్రాల ప్రకారం కనీస వేతనాలు నిర్ణయించాలన్నారు.కార్మికుడు జీవిత భాగస్వామి ఇద్దరు పిల్లలతో వారి బట్టలు పిల్లల విద్య,వైద్యం, వినోదం, పండుగలు తదితర ఖర్చులు, వృద్ధాప్యంలో తల్లిదండ్రుల పోషణ ఖర్చులు తీర్చుకునేలా వేతనాలు ఉండాలన్నారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల నిజమైన అవసరాల ఆధారిత



కనీస వేతనాన్ని నిర్ణయించాలని టియుసిఐ కోరుతుందన్నారు.మే 2026 లో ఉన్న రిటైల్ ధరల ఆధారంగా చట్టబద్ధమైన కనీస వేతనం నెలకు 39,373/– కోసం కార్మిక వర్గం ఉద్యమించాలని,ఈ డిమాండ్ తో ఈనెల 20న జరిగే ఆందోళనలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ ప్రెస్ మీట్ లో టియుసిఐ జిల్లా అధ్యక్షులు ఎం.నరేందర్,జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్,జిల్లా ఉపాధ్యక్షులు ఎం.వెంకన్న,డి.రాజేశ్వర్, సహాయ కార్యదర్శి బి.కిషన్, జిల్లా నాయకులు బి.మురళి, డి.కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు

**కూకట్‌పల్లి, ఆగస్టు 12, నేటి శుభోదయ :** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) మేడ్చల్ జిల్లా, కూకట్‌పల్లి నియోజకవర్గ నూతన కార్యవర్గ నాయకులు కూకట్‌పల్లి జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) రితిరాజ్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా టీడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షులు కట్టెల మల్లేశం, జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, కూకట్‌పల్లి అధ్యక్షులు ఎర్ర యాకయ్య డీసీపీని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నూతన కార్యవర్గ సభ్యులను డీసీపీ రితిరాజ్ అభినందించారు.ఈ సందర్భంగా డీసీపీ రితిరాజ్ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణే పోలీసుల ప్రధాన ధ్యేయమని అన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇస్తూనే చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిషేధిత గుట్కా, గంజాయి విక్రయాలను అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నామని, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారితో పాటు ఈవ్‌టీజింగ్‌కు పాల్పడే వ్యక్తులపై కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు.ఆపద సమయంలో ప్రజలు వెంటనే డయల్ 112కు ఫోన్ చేసి పోలీసుల సహాయం పొందాలని సూచించారు. ఏదైనా సమస్య ఎదురైనప్పుడు ఆలస్యం చేయకుండా పోలీసులకు సమాచారం అందించాలని డీసీపీ కోరారు.టీడబ్ల్యూజేఎఫ్ కూకట్‌పల్లి అధ్యక్షులు ఎర్ర యాకయ్య మాట్లాడుతూ డీసీపీ రితిరాజ్ పోలీసు శాఖలో సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్న అధికారిణిగా గుర్తింపు పొందారని



అన్నారు. ఆమె బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో పెరిగారని, ఢిల్లీలోని నేషనల్ లా యూనివర్సిటీలో న్యాయశాస్త్రంలో పట్టా పొందారని తెలిపారు. 2018 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారిణిగా తెలంగాణ కేడర్‌కు ఎంపికై, హైదరాబాద్‌లోని నేషనల్ పోలీస్ అకాడమీలో శిక్షణ పూర్తి చేసిన అనంతరం పలు కీలక బాధ్యతలు నిర్వహించారని పేర్కొన్నారు.జోగులాంబ గద్వాల జిల్లా ఎస్పీగా పనిచేసిన సమయంలో ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషించారని, పోలీసు సంక్షేమ కార్యక్రమాల్లోనూ చురుకుగా వ్యవహరించారని ఎర్ర యాకయ్య తెలిపారు.ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ కూకట్‌పల్లి ప్రధాన కార్యదర్శి నాగుల అంజిబాబు, ఉపాధ్యక్షులు బొమ్మ గోపి, కోశాధికారి మహమ్మద్ షబ్బీర్, కార్యవర్గ సభ్యులు శ్యాంసుందర్, నవీన్ కుమార్, సైదులు, నాగరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ బలోపేతానికి బూత్ స్థాయి నుంచే కృషి చేయాలి
## : జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు వజ్రష్ యాదవ్



**శామీర్ పేట, ఆగస్టు 12, నేటి శుభోదయ :** పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు బూత్ స్థాయి నుంచి పటిష్ఠమైన కార్యాచరణతో ముందుకు సాగాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో అంకితభావంతో పనిచేసిన బూత్ స్థాయి ఏజెంట్ల కృషి అభినందనీయమని పేర్కొన్నారు.మేడ్చల్, పూడూరు, కిష్టాపూర్, శామీర్‌పేట, కీసర డివిజన్లకు చెందిన బీఎల్ఏల సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఓటరు జాబితా సవరణలో బీఎల్ఏలు క్షేత్రస్థాయిలో పర్యటించి ఓటర్ల వివరాలను పరిశీలించడం, అవసరమైన మార్పులు, చేర్పులు, తొలగింపుల ప్రక్రియను పర్యవేక్షించడం వంటి బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించారని తెలిపారు. పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తను కాంగ్రెస్ పార్టీ గుర్తించి తగిన గౌరవం కల్పిస్తుందని అన్నారు.డివిజన్ అధ్యక్షులు తమ పరిధిలో పార్టీ కమిటీలను త్వరితగతిన ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పార్టీ సిద్ధాంతాలపై నమ్మకం, ప్రజలతో నిరంతర సంబంధాలు, క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేసే సామర్థ్యం ఉన్నవారికి కమిటీల్లో ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. ప్రతి డివిజన్‌లో పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుని ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు.ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో బీఎల్ఏలు చూపిన చొరవను అభినందిస్తూ వారికి సన్మానం నిర్వహించడం ద్వారా కార్యకర్తల్లో మరింత ఉత్సాహం కలుగుతుందని వజ్రేష్ యాదవ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి, మాజీ డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి,



మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఇన్‌చార్జి గజ్జల కాంతం, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, డివిజన్ అధ్యక్షులు, బీఎల్ఏలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తా
## : రంగుల శంకర్ నేత



**జవహర్ నగర్, ఆగస్టు 12, నేటి శుభోదయ :** భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా తనను రెండోసారి నియమించడం పట్ల రంగుల శంకర్‌నేత హర్షం వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో మరోసారి కీలక బాధ్యతలు అప్పగించిన ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గంధమల్ల ఆనంద్‌గౌడ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తన నియామకానికి సహకరించిన రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మేడ్చల్ రూరల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా శంకర్‌నేత మాట్లాడుతూ.. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తానన్నారు. ఓబీసీ వర్గాల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తూ, క్షేత్రస్థాయిలో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్తానని తెలిపారు.తనకు అప్పగించిన బాధ్యతను ఒక పదవిగా కాకుండా పార్టీ తనపై ఉంచిన నమ్మకంగా భావిస్తున్నానని చెప్పారు. బీజేపీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేస్తూ ఓబీసీ వర్గాలను పార్టీతో మరింత అనుసంధానం చేసేందుకు కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన పార్టీ నాయకులు, శ్రేయోభిలాషులు, కార్యకర్తలందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రభుత్వ భూముల కబ్జాపై కలెక్టర్ కొరడా ఝుళిపించాలి

**హెచ్చరిక బోర్డులు పెట్టినా లెక్కచేయని ఆక్రమణదారులు.. ఉపాధి హామీ రోడ్డునూ దున్నేసిన వైనం**

**ముత్తారం మండలం శాత్రాజ్‌పల్లిలో 21.26 ఎకరాల ప్రభుత్వ భూమి**

**ఆక్రమణపై రెవెన్యూ విచారణ రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంపై మాజీ జెడ్పీటీసీ నాగినేని**

**హైకోర్టును ఆశ్రయించిన జగన్మోహన్ రావు**



**మంథని, ఆగస్టు 11, నేటి శుభోదయ :** ప్రభుత్వ భూముల పరిరక్షణలో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముత్తారం మండలం శాత్రాజ్‌పల్లి గ్రామంలోని సర్వే నంబర్ 181లో ప్రభుత్వ భూమిని ఆక్రమించి యథేచ్ఛగా వినియోగిస్తున్న వ్యవహారం తాజాగా రెవెన్యూ విచారణలో వెలుగులోకి వచ్చింది. మొత్తం 708.26 ఎకరాల విస్తీర్ణం ఉన్న ఈ సర్వే నంబర్‌లో 21.26 ఎకరాల ప్రభుత్వ భూమిని కాసగోని రవి ఆక్రమించినట్లు మండల గిర్దావర్, మండల సర్వేయర్ క్షేత్రస్థాయి పరిశీలనలో గుర్తించినట్లు తహసీల్దార్ నివేదికలో పేర్కొన్నారు.

### హెచ్చరిక బోర్డులున్నా.. ఆక్రమణ ఆగలేదు!

ప్రభుత్వ భూమి అని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినప్పటికీ వాటిని ఏమాత్రం లెక్కచేయకుండా ఆక్రమణలు కొనసాగుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా గత వేసవిలో ఉపాధి హామీ పథకం కింద ప్రభుత్వ నిధులతో వేసిన రోడ్డును సైతం ఆక్రమణదారులు దున్ని తమ భూమిలో కలుపుకున్నారనే ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన అధికారులు కళ్లముందే ఆక్రమణలు జరుగుతున్నా ఎందుకు అడ్డుకోలేదనే ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి.

### పౌల్ట్రీ ఫారం.. మామిడి తోట.. వరి సాగు

రెవెన్యూ అధికారుల క్షేత్రస్థాయి విచారణలో ప్రభుత్వ భూమిలో పౌల్ట్రీ ఫారం ఏర్పాటు చేయడంతో పాటు మామిడి చెట్లు పెంచుతున్నట్లు, వరి సాగు చేస్తున్నట్లు గుర్తించినట్లు నివేదికలో పేర్కొన్నారు. ప్రభుత్వ భూమిని ప్రైవేటు అవసరాలకు వినియోగిస్తున్నట్లు అధికారులు నమోదు చేయడం ఈ వ్యవహారం తీవ్రతను తెలియజేస్తోంది.

### ఫిర్యాదుతో కదిలిన రెవెన్యూ యంత్రాంగం

నాగినేని జగన్‌మోహన్‌రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. స్థల పరిశీలన, సర్వే అనంతరం ప్రభుత్వ భూమి ఆక్రమణకు సంబంధించిన వివరాలను నివేదికలో పొందుపరిచారు. అనంతరం ముత్తారం తహసీల్దార్ పోలీసులకు లేఖ రాసి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరినట్లు అధికారిక పత్రాల్లో ఉంది.

### అధికారుల నిర్లక్ష్యంతోనే కబ్జాలు

ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన రెవెన్యూ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోకపోవడం వల్లే ఆక్రమణదారులకు ధైర్యం వస్తోందని మాజీ జెడ్పీటీసీ నాగినేని జగన్‌మోహన్‌రావు మండిపడ్డారు. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా వాటిని ధిక్కరించి ప్రభుత్వ భూమిని ఆక్రమించడం, ప్రభుత్వ నిధులతో వేసిన ఉపాధి హామీ రోడ్డును సైతం దున్నేయడం తీవ్రమైన విషయమన్నారు. ప్రభుత్వ భూమిని కాపాడటంలో విఫలమైన అధికారుల నిర్లక్ష్యంపైనా సమగ్ర విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు.




### హైకోర్టును ఆశ్రయించిన మాజీ జెడ్పీటీసీ

ఈ వ్యవహారంపై నాగినేని జగన్‌మోహన్‌రావు హైకోర్టును కూడా ఆశ్రయించారు. అందుబాటులో ఉన్న కేసు వివరాల ప్రకారం డబ్ల్యూపీ నం. 38273/2026, సీఆర్‌ఎన్ నంబర్ హెచ్‌బీహెచ్‌సీ010530542026గా, 'నాగినేని వర్సెస్ స్టేట్' పేరుతో కేసు దాఖలైనట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రెవెన్యూ విచారణ నివేదిక, పోలీసులకు పంపిన తహసీల్దార్ లేఖ ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

### కలెక్టర్ స్పందించాలి

శాత్రాజ్‌పల్లిలో ప్రభుత్వ భూమి ఆక్రమణపై జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రత్యేకంగా దృష్టిసారించి ఆక్రమిత భూమిని స్వాధీనం చేసుకోవడంతో పాటు ప్రభుత్వ రోడ్డును తిరిగి రక్షించాలి, ఆక్రమణకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అదే సమయంలో ప్రభుత్వ భూమి ఆక్రమణ జరుగుతున్న సమయంలో అధికారులు ఎందుకు అడ్డుకోలేకపోయారనే అంశంపైనా విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత ఉన్న అధికారుల నిర్లక్ష్యంపై కలెక్టర్ ఏ మేరకు స్పందిస్తారో వేచి చూడాలి.

# కేసులు.. బెదిరింపులకు భయపడేది లేదు



**నేరెడ్ మెట్, ఆగస్టు 12, నేటి శుభోదయ :** విద్యార్థుల సమస్యలపై తమ పోరాటాన్ని ఎన్ని అక్రమ కేసులు పెట్టినా, బెదిరింపులకు పాల్పడినా ఆపేది లేదని బీఆర్ఎస్వీ నాయకులు హెచ్చరించారు. గురుకుల విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్‌లోని సంక్షేమ భవన్ వద్ద నిర్వహించిన ధర్నాకు సంబంధించి నమోదైన కేసులో భాగంగా బుధవారం నాంపల్లి కోర్టుకు హాజరయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గురుకుల విద్యార్థుల సమస్యలపై నిర్లక్ష్యం వహించడంతో ఆహార కలుషిత ఘటనలు చోటుచేసుకుని పలువురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని బీఆర్ఎస్వీ నాయకులు ఆరోపించారు. దీనికి నిరసనగా సంక్షేమ భవన్ వద్ద ధర్నా నిర్వహించగా తమపై అక్రమ కేసులు నమోదు చేశారని పేర్కొన్నారు.విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన ముఖ్యమంత్రే విద్యాశాఖ బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించడం లేదని విమర్శించారు. కేసులు, బెదిరింపులకు తాము భయపడబోమని, విద్యార్థులకు న్యాయం జరిగే వరకు ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామని స్పష్టం చేశారు.

# ఏన్కూరు ఎంపీఓ జీవీఎస్ నారాయణకు ఎంపీడీవోగా పదోన్నతి



**ఏన్కూర్, ఆగస్టు 12, నేటి శుభోదయ :** ఏన్కూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీఓగా విధులు నిర్వహిస్తున్న జీవీఎస్ నారాయణ కు ఎంపీడీవోగా పదోన్నతి లభించింది. ప్రభుత్వం చేపట్టిన పదోన్నతుల ప్రక్రియలో భాగంగా ఆయనకు ఎంపీడీవోగా పదోన్నతి కల్పించినట్లు సమాచారం. ఇప్పటివరకు ఏన్కూరు మండలంలో ఎంపీఓగా విధులు నిర్వహించిన జీవీఎస్ నారాయణ పరిపాలనా వ్యవహారాల్లో తనదైన సేవలు అందించారు. పదోన్నతి అనంతరం ఖమ్మం జిల్లాలో ఏ మండలానికి ఎంపీడీవోగా నియమిస్తారనే విషయం ప్రస్తుతం ఆసక్తిగా మారింది. ఆయన కొత్త పోస్టింగ్‌పై అధికారిక ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది.జీవీఎస్ నారాయణకు ఎంపీడీవోగా పదోన్నతి లభించడంపై ఏన్కూరు మండలానికి చెందిన అధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

# పాపిరెడ్డిగూడ పాఠశాలలో

## ఉత్సాహంగా మార్క్ పోల్ ఎన్నికలు






**కేశంపేట, ఆగస్టు 12, నేటి శుభోదయ :** కేశంపేట మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం మార్క్ పోల్ ఎన్నికలను ప్రజాస్వామ్య పద్ధతిలో ఉత్సాహంగా నిర్వహించారు. ఈ ఎన్నికల్లో పాఠశాలలోని విద్యార్థులందరూ ఎంతో ఆసక్తిగా పాల్గొని తమకు నచ్చిన అభ్యర్థులకు ఓటు వేశారు. ఉపాధ్యాయులు కూడా ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములై తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.ఎస్పీఎల్ పదవికి నలుగురు విద్యార్థులు పోటీ చేయగా, హేమంత్ కుమార్ గౌడ్ అత్యధిక ఓట్లు సాధించి విజేతగా నిలిచారు. అలాగే హెడ్ గర్ల్ పదవికి నలుగురు విద్యార్థులు పోటీలో ఉండగా, అమూల్య విజయం సాధించింది. హెడ్ బాయ్ పదవికి నలుగురు విద్యార్థులు పోటీ చేయగా, మూడవత్ గౌతం విజేతగా నిలిచాడు.ఎన్నికల సందర్భంగా విద్యార్థుల్లో ఎంతో ఉత్సాహం కనిపించింది. ఓటింగ్ ప్రక్రియ, అభ్యర్థుల ఎంపిక, ఫలితాల ప్రకటన తదితర కార్యక్రమాలను పాఠశాల సిబ్బంది పర్యవేక్షించారు. ఎన్నికల ద్వారా విద్యార్థులకు ప్రజాస్వామ్య విధానం, ఓటు హక్కు, నాయకత్వ లక్షణాలు, బాధ్యత, క్రమశిక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. విజేతలుగా నిలిచిన హేమంత్ కుమార్ గౌడ్, అమూల్య, మూడవత్ గౌతంను ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

# పోక్సో కేసులో నిందితుడికి జీవిత ఖైదు, యాభై ఏడు వేలు జరిమానా

**- ప్రాసిక్యూషన్ సహకరించిన అధికారులను అభినందించిన పోలీసు కమిషనర్**



**ఖమ్మం, ఆగస్టు 12, నేటి శుభోదయ :** పాఠశాలకు వెళ్లిన బాలికను తన మాయ మాటలతో బయటకు తీసుకెళ్లి లైంగికదాడికి ఒడిగట్టిన నిందితుడికి జీవిత కాలం పాటు జైలు శిక్ష, యాభై ఏడు వేల రూపాయలు జరిమానాలు విధిస్తూ.. మొదటి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు గౌరవనీయ న్యాయమూర్తి డా. పుల్లభట్ల పోగడ కృష్ణ అర్జున్ బుధవారం తీర్పు వెల్లడించారని టూ టౌన్ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ తెలిపారు.ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. 2023 సెప్టెంబర్ 20 న నిందితుడైన సూర్యాపేట జిల్లా, అంజనపురి కాలనీ చెందిన, అప్పుడు ఖమ్మం టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బాలిక ఇంటి ప్రక్కనే నివాసం ఉంటున్న అల్లి రాకేష్ 22 సం, పాఠశాలకు వెళ్లిన బాలికను మాయమాటలతో బలవంతంగా బయటకు తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడినట్లు బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుతో టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో క్రైమ్ నెంబర్ క్రైం నం.425/2023.ఎస్ సి .నెంబర్ .83/2023. యు/ఎస్ 366,376,506 ఐపిసి, సెక్షన్. పోక్సో చట్టం 2012 కింద కేసు నమోదు చేసిన అనంతరం విచారణ, సాక్ష్యాధారాల సేకరణ వేగవంతంగా పూర్తిచేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశామని తెలిపారు. కేసు పూర్వపరాలు, సాక్ష్యాధారాలు, వైద్య నివేదికను పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడి పై మోపిన నేరం రుజువు కావడంతో పై విధంగా తీర్పు చెప్పారు.ప్రాసిక్యూషన్ తరపున అదనపు ప్రాసిక్యూటర్ జమ్ముల శరత్ కుమార్ రెడ్డి వాదించారు. అప్పటి విచారణ అధికారి ఇన్స్పెక్టర్ కుమారస్వామి, ప్రస్తుత ఇన్స్పెక్టర్ బాలకృష్ణ, భరోసా లీగల్ ఆఫీసర్ ఎం.ఉమా రాణి, కోర్టు కానిస్టేబుల్ తల్లా. రమణ, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ శ్రీకాంత్, హోంగార్డ్ అయూబ్,చిట్టిబాబు ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు.

# ఉద్యమకారుల హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలి

**- సెప్టెంబర్ 16న ఉస్మానియా యూనివర్సిటీలో భారీ బహిరంగ సభ**



**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 12, నేటి శుభోదయ :** తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేసి, వారికి తక్షణమే లబ్ధి చేకూర్చాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా ఉద్యమకారుల సమన్వయకర్త గడ్డం శ్రీరామ్ డిమాండ్ చేశారు. బుధవారం భద్రాచలంలో ఉద్యమకారుల సమావేశం ఆయన ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా గడ్డం శ్రీరామ్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమకారులకు మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా 250 గజాల ఇంటి స్థలం కేటాయించాలని కోరారు. ఉద్యమంలో పాల్గొన్న వారందరినీ తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తించి తామ్రపత్రాలు అందజేయాలని, ఆరోగ్య భద్రత కోసం హెల్త్ కార్డులు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యమకారులకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పించడంతో పాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఉద్యమకారుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంతో పాటు తమ ఐక్యతను చాటిచెప్పేందుకు సెప్టెంబర్ 16న ఉస్మానియా యూనివర్సిటీలో ఉద్యమకారులతో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభకు ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.సమావేశంలో తొలి తరం ఉద్యమకారుడు సిద్ధులు, టీఎన్జీవో నాయకుడు చల్లగుల్ల నాగేశ్వరరావు, జిల్లా న్యాయ సేవాధికారిగా పనిచేసిన పడిసిరి శీను, తెలంగాణ ఉద్యమ నాయకులు రామాచారి, తాళ్ల రవి, చెన్నూరు సమయ, తూతిక ప్రకాష్, మీడియా ప్రతినిధులు తోకల నాగేశ్వరరావు, ఆనంద్, గడ్డం సుధాకర్ పాల్గొన్నారు.

# నా మొదటి ప్రాధాన్యత విద్య, వైద్యానికే - భాస్కర్ నాయక్



**మిడ్జిల్, ఆగస్టు 12, నేటి శుభోదయ :** నిరుపేద విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకిగా మారకూడదనే ఉద్దేశంతో భాస్కర్ నాయక్ మరోసారి తన సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. బాలానగర్ మండలం చింతకుంట తండాకు చెందిన శ్రీకాంత్ కు అడ్మిషన్ ఫీజు కోసం రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆర్థిక పరిస్థితుల కారణంగా చదువుకు దూరం కాకుండా విద్యార్థికి అండగా నిలవడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.విద్యకు ప్రోత్సాహం అందించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ప్రాథమిక అవసరాల పరిష్కారానికి కూడా భాస్కర్ నాయక్ ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇందులో భాగంగా రాజాపూర్ మండలం మోతులకుంట తండాలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు బోర్ ఏర్పాటు చేశారు. దీంతో తండా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కొంతమేర తగ్గనున్నాయి.విద్యార్థులకు ఆర్థిక సహాయం, గ్రామీణ ప్రజలకు తాగునీటి సౌకర్యం వంటి కార్యక్రమాలతో భాస్కర్ నాయక్ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. సమాజంలోని పేద, నిరుపేద కుటుంబాలకు అవసరమైన సమయంలో తన వంతు సహకారం అందిస్తూ ముందుకు సాగుతున్న ఆయనను స్థానికులు అభినందించారు."చదువుకునే ప్రతి విద్యార్థికి అవకాశం కల్పించాలి.. ప్రజల ప్రాథమిక అవసరాలకు అండగా నిలవాలి" అనే లక్ష్యంతో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు భాస్కర్ నాయక్ తెలిపారు

# తూంపల్లి రహదారికి మరమ్మతులు - ఎమ్మెల్యే చొరవతో తక్షణ చర్యలు



**నిజామాబాద్, ఆగస్టు 12, నేటి శుభోదయ :** ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా కొండాపూర్ చెరువు తెగిపోవడంతో తూంపల్లి–కొండాపూర్ గ్రామాల మధ్య ఉన్న ప్రధాన రహదారి కోతకు గురై రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో తూంపల్లి గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.విషయం తెలుసుకున్న నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతి రెడ్డి గారు సంఘటన స్థలాన్ని స్వయంగా పరిశీలించి, ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తక్షణమే రహదారి మరమ్మతు పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఎమ్మెల్యే గారి ఆదేశాల మేరకు మరుసటి రోజే అధికారులు పనులు ప్రారంభించి, రహదారికి మరమ్మతులు చేపట్టి, అవసరమైన పైపులు ఏర్పాటు చేసి కల్వర్ట్ నిర్మాణం పూర్తి చేశారు. దీంతో తూంపల్లి గ్రామానికి రాకపోకలు పునరుద్ధరించబడి ప్రజలకు ఎంతో ఉపశమనం కలిగింది.ఈ సమస్యపై తక్షణమే స్పందించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టిన నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే రేకులపల్లి భూపతి రెడ్డి గారికి, అలాగే పనులు త్వరితగతిన పూర్తయ్యేలా సహకరించిన డీసీసీ ప్రధాన కార్యదర్శి వెల్మ భాస్కర్ రెడ్డి గారికి, యూత్ ప్రెసిడెంట్ తూంపల్లి మహేందర్ గారికి తూంపల్లి గ్రామ ప్రజలు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణమే స్పందించి రహదారి పునరుద్ధరణకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ గ్రామ ప్రజలు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జింక రాజేందర్ ఉపసర్పంచ్ అయినాల శ్రీకాంత్ వార్డు సభ్యులు గోవర్ధన్, రాజు, గ్రామ శాఖ అధ్యక్షులు హరీష్ గౌడ్, తేడ్ల లక్ష్మణ్, లక్ష్మణ్ గౌడ్,బుచ్చన్న, మహేందర్, గంగ సాయిలు, ప్రవీణ్,బాలరాజ్ గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# ప్రమాదంలో రెండు చేతులు, రెండు కాళ్లు కోల్పోయిన గిరిజనుడికి బ్యాటరీ వీల్‌చైర్...



**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 12, నేటి శుభోదయ :** ప్రమాదవశాత్తు రెండు చేతులు, రెండు కాళ్లు కోల్పోయిన నిరుపేద గిరిజనుడు మడకం ఈడమయ్యకు రూ.లక్ష విలువైన బ్యాటరీ వీల్‌చైర్‌ను అందజేసినట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ తెలిపారు. అలాగే కుటుంబ పోషణ కోసం చిన్న వ్యాపారం చేసుకునేందుకు వికలాంగుల సంక్షేమ శాఖ ద్వారా రూ.50 వేల ఆర్థిక సహాయం అందించనున్నట్లు వెల్లడించారు.బుధవారం ఐటీడీఏ పీవో కార్యాలయంలో జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ శివనాయక్, న్యాయవాదులు, గ్రామస్థుల సమక్షంలో మడకం ఈడమయ్యకు బ్యాటరీ వీల్‌చైర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా పీవో రాహుల్ మాట్లాడుతూ.. చర్ల మండలం బక్కచింతలపాడు గ్రామానికి చెందిన ఈడమయ్య ఆరు సంవత్సరాల క్రితం రాడ్ బైండింగ్ పనికి వెళ్లిన సమయంలో ప్రమాదానికి గురయ్యాడన్నారు. చేతిలో ఉన్న ఇనుప రాడ్లు విద్యుత్ తీగలకు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై రెండు చేతులు, రెండు కాళ్లు తీవ్రంగా కాలిపోయి శాశ్వత వైకల్యానికి గురయ్యాడని తెలిపారు.పేద గిరిజన కుటుంబానికి చెందిన ఈడమయ్య వైకల్యం కారణంగా కుటుంబాన్ని పోషించుకోవడంలో ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గ్రామానికి చెందిన జూనియర్ న్యాయవాదులు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ శివనాయక్ దృష్టికి తీసుకెళ్లారని, ఆయన తన దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించి రూ.లక్ష విలువైన బ్యాటరీ వీల్‌చైర్‌ను అందించినట్లు రాహుల్ చెప్పారు.వీల్‌చైర్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఈడమయ్యకు సూచించారు. అలాగే వికలాంగుల సంక్షేమ శాఖ ద్వారా అందించనున్న రూ.50 వేలతో చిన్న వ్యాపారం ప్రారంభించి కుటుంబానికి జీవనోపాధి కల్పించుకోవాలని సూచించారు.

**మేజిస్ట్రేట్‌కు ఘన సన్మానం**

ఇదిలా ఉండగా.. జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ శివనాయక్ తొలిసారిగా ఐటీడీఏ పీవో బి.రాహుల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పీవోకు మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రాహుల్, మేజిస్ట్రేట్ శివనాయక్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ స్వర్ణలత లేనినా, ఐటీడీఏ పరిపాలన అధికారి సున్నం రాంబాబు, సీనియర్ న్యాయవాదులు ఆలూరు సత్యనారాయణ, అంబేద్కర్ రామరాజు, తిరుమల్‌రావు, సాధనపల్లి సతీష్, దాట్ల సంధ్య, బి.శారద, గాయత్రి, వర్ధన్ మల్లేష్, బండ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక హక్కుల సాధనకై పోరుబాట.. ఈనెల 17న BMS ధర్నా



**సంగారెడ్డి, ఆగస్టు 12, నేటి శుభోదయ :** కార్మికుల హక్కుల పరిరక్షణ మరియు వారి సంక్షేమమే ధ్యేయంగా భారతీయ మజ్దూర్ సంఘ్ (BMS) నిరంతరం పోరాడుతుందని బి.ఎమ్.ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కుమ్మరి నర్సింలు పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కార్యాలయంలో మాట్లాడుతూ శ్రమజీవుల సమస్యల పరిష్కారం కోసం దేశవ్యాప్తంగా బిఎంఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 17న అన్ని జిల్లా కేంద్రాల్లో భారీ నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్నామని తెలిపారు పెరిగిన జీవన వ్యయం, ద్రవ్యోల్బణానికి అనుగుణంగా కార్మికుల వేతనాలు, పెన్షన్లు మరియు ఇతర సౌకర్యాలను మెరుగుపరచడానికి 2026 సంవత్సరానికి గాను BMS రూపకల్పన చేసిన 18 ముఖ్య డిమాండ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.బుధవారం నాడు నంది కంది బ్లూ క్రాఫ్ట్ అగ్రో LTD. లో ధర్నా కర్ర పత్రం ను ఆవిష్కరించారు అనంతరం కుమ్మరి నర్సింలు మాట్లాడుతూ, కార్మిక రంగాన్ని బలోపేతం చేసేందుకు కింద పేర్కొన్న ప్రధాన డిమాండ్లపై ప్రభుత్వాలు సానుకూలంగా స్పందించాలని విజ్ఞప్తి చేశారు:వేతన పరిమితులు & పెన్షన్ పెంపు: ESIC వేతన పరిమితిని నెలకు రూ. 42,000కు, EPF పరిమితిని రూ. 30,000కు పెంచాలి. అలాగే EPS కనీస పెన్షన్‌ను రూ. 1,000 నుండి రూ. 7,500కు పెంచి, DA సౌకర్యం మరియు పూర్తిస్థాయి వైద్య సౌకర్యాలు కల్పించాలి.కనీస వేతనం రూ. 30,000: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా దేశవ్యాప్తంగా కనీస వేతనాన్ని నెలకు రూ. 30,000గా నిర్ణయించాలి.పాత పెన్షన్ (OPS) పునరుద్ధరణ: ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ జీవితానికి భద్రతనిచ్చే పాత పెన్షన్ విధానాన్ని (OPS) వెంటనే పునరుద్ధరించాలి.సమాన పనికి సమాన వేతనం: కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలి. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కాంట్రాక్ట్ కార్మికులకు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా వేతనం చెల్లించాలి.ఉద్యోగ భద్రత & రెగ్యులరైజేషన్: పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న GDS లను వెంటనే రెగ్యులరైజ్ చేయాలి. గ్రాట్యుటీ గరిష్ట పరిమితిని రూ. 20 లక్షల నుండి రూ. 40 లక్షలకు పెంచాలి.రక్షణ & ప్రత్యేక సంక్షేమం: బ్యాంక్ ఉద్యోగులకు వారానికి 5 రోజుల పనిదినాలు అమలు చేయాలి. అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు కనీస వేతనం మరియు పెన్షన్ కల్పించాలి. గిగ్ వర్కర్స్ (స్విగ్గీ, జొమాటో, ఓలా, ఉబర్ ), హమాలీలు మరియు దినసరి కార్మికుల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేయాలి.కార్మిక వ్యతిరేక విధానాలను, నూతన లేబర్ కోడ్ లో సవరణలు తక్షణమే చేపట్టి కార్మిక చట్టాలను ఉల్లంఘించే యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వాలు స్పందించలని బి.ఎమ్.ఎస్ ఆధ్వర్యంలో కార్మికులను ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని కుమ్మరి నర్సింలు హెచ్చరించారు.

# గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి - టీఎస్ యుటిఎఫ్ డిమాండ్





**ఏన్కూర్, ఆగస్టు 12, నేటి శుభోదయ :** గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి డిఎస్.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.బుధవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల మూలపోచారంలో పోస్ట్ కార్డు క్యాంపెయిన్ లో భాగంగా సీఎంకు సమస్యలపై సంతకాల సేకరణ చేసి పోస్ట్ చేశారు.ఈ సందర్భంగా టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి డిఎస్. నాగేశ్వరరావు మాట్లాడుతూ 1970 దశకంలో గిరిజన సంక్షేమ శాఖ యాజమాన్యంలో ప్రారంభమైన పాఠశాలలు మారుమూల ఏజెన్సీ, గిరిజన గ్రామాల్లో ఎందరో గిరిజన విద్యార్థులకు మంచి విద్యను అందించి వారి ఉన్నతికి కారణమైన పాఠశాలలు,నేడు తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నాయన్నారు.అందులో పని చేస్తున్న ఉపాధ్యాయులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. సమస్యలను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చినా పరిష్కారానికి నోచుకోలేదన్నారు. రెసిడెన్షియల్,గురుకులాలపై చూపుతున్న శ్రద్ధ,పెడుతున్న ఖర్చులో కనీసం కొంచెమైనా గిరిజన సంక్షేమ పాఠశాలలపై పెడితే మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. ప్రభుత్వ,జిల్లా పరిషత్ పాఠశాలల్లో వేలాది పండిట్స్, పీఈటీ పోస్టులు అప్గ్రేడ్ చేసి పదోన్నతి కల్పించిన రాష్ట్ర ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 350 నుండి 400మంది పండిట్స్,పీఈటీ పోస్టులను నేటికీ అప్ గ్రేడ్ చేయకుండా నిర్లక్ష్యం చేస్తూ గిరిజన ఉపాధ్యాయులపై సవితి తల్లి ప్రేమ చూపిస్తున్నదని మండిపడ్డారు.ఇప్పటికైనా పండిట్స్,పీఈటీ పోస్టులను అప్ గ్రేడ్ చేసి ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించాలన్నారు.క న్వర్టెడ్ ఆశ్రమ పాఠశాలలు ప్రారంభించి 13 సంవత్సరాలు పూర్తి అయినా నేటికీ ఒక్క పోస్టు మంజూరు చేయకుండ తాత్కాలిక ఉపాధ్యాయులతో నడిపించటం దారుణమన్నారు.వెంటనే కన్వర్టెడ్ పాఠశాలలకు పోస్టులు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు.రాష్ట్రంలో మిగిలిన హాస్టల్స్ ను ఆశ్రమ పాఠశాలలుగా కన్వర్ట్ చేయాలన్నారు. గిరిజన సంక్షేమ పాఠశాలలకు పర్యవేక్షణ అధికారులు ట్రైబల్ ఎంఈఓ,ట్రైబల్ డిప్యూటీ డిఇఓ, పిఎంఓ,ఏసిఎంఓ పోస్టులను మంజూరు చేయాలని,జేఎల్ గా పదోన్నతి కల్పించాలని, గిరిజన ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు స్కూల్ గ్రాంట్లు మంజూరు చేయాలని,ఆశ్రమ పాఠశాలలకు కంప్యూటర్ ఫ్యాకల్టీ, ఏఎన్ఎం లను, స్కావెంజర్ పోస్టులను నియమించాలన్నారు .ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సి.ఆర్.టి లకు బేసిక్ పే ఇవ్వాలని, వారి సర్వీసును క్రమబద్ధీకరించాలని వారు డిమాండ్ చేశారు. సీఎంగా మీరు పై సమస్యలపై జోక్యం చేసుకొని గిరిజన సంక్షేమ రంగంలోని పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపిస్తారనే నమ్మకంతో ఈ లేఖ ద్వారా మా సమస్యలను మీ దృష్టికి తీసుకొస్తున్నామని, వెంటనే స్పందించి సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.నాగరాజు, సీనియర్ ఉపాధ్యాయులు బి.శోభన్,బి.రవి,వి. రమేష్, పి.శ్రీనివాస్, కే.శ్యామల, బి.రవి (హిందీ) బి.సక్రాం,జె. నాగేశ్వరరావు, నాగమణి, డి.ఉషశ్రీ, నలిని, కపూర్య తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ హౌస్ బుజ్గర్ నూతన గ్రామ కమిటీ ఎన్నిక

**వరంగల్, ఆగస్టు 12, నేటి శుభోదయ :** మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) బలోపేతంలో భాగంగా తెలంగాణలోని వివిధ గ్రామాలలో నూతన గ్రామ కమిటీల ఎన్నికలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. మండల నాయకుల ఆధ్వర్యంలో గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి, సర్వసమ్మతితో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకుంటున్నారు.ఇందులో భాగంగా పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా అత్మకూర్ మండలం,హౌస్ బుజ్గూర్. గ్రామంలో బుధవారం అత్మకూరు మండల ఇన్చార్జి నద్దునూరి రఘు మాదిగ, కో ఇన్చార్జి అర్షం సుధాకర్ మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి నూతన గ్రామ కమిటీని ఎన్నుకోవడం జరిగింది. హౌస్ బుజ్గర్ గ్రామ ఎమ్మార్పీఎస్ నూతన అధ్యక్షుడు మామిడి మహేష్ మాదిగ.అధికార ప్రతినిధి పెండెల కరుణాకర్ మాదిగ,ఉపాధ్యక్షుడు మంగలపల్లి శివాజీ మాదిగ, ఉపాధ్యక్షుడు-2 మామిడి పవన్ మాదిగ,ప్రధాన కార్యదర్శి మంగలపల్లీ రత్నాకర్ మాదిగ,ప్రధానకార్యదర్శి దుప్పటి సాంబయ్య మాదిగ, కోశాధికారి. జన్ను కుమార్ కార్యదర్శి దుప్పటి వెంకటేష్సహాయ కార్యదర్శి బుర్రి విష్ణు, కార్యవర్గ సభ్యులు. బుర్రి నరేష్. దుప్పటి మహేందర్ మామిడి రాజేష్. ఎంఎస్పీ గ్రామ కమిటి అధ్యక్షుడు.ఉప్పరి మొగిలి,ఉపాధ్యక్షుడు మామిడి కుమార్,ప్రధానకార్యదర్శి మంగాలపల్లి నవీన్,అధికార ప్రతినిధి నీలం కుమార్,కోశాధికారి.దుప్పటి శంకర్,కార్యదర్శి మంగాలపల్లీ సాంబయ్య..దామెర సాంబయ్య మామిడి జంపయ్య లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న విహెచ్ పిఎస్ సీనియర్ నాయకులు పెండేల బిక్షపతి మాదిగ,సోషల్ మీడియా (ఎమ్మార్పీఎస్) అర్షం పవన్,తదితరులు పాల్గొన్నారు



**ఎమ్మార్పీఎస్ కొత్తగట్టు నూతన గ్రామ కమిటీ ఎన్నిక**

ఆత్మకూర్ మండలంలోని కొత్తగట్టు గ్రామంలో ఆత్మకూరు మండల ఎమ్మార్పీఎస్ ఇన్చార్జి నద్దునూరి రఘు మాదిగ,కో ఇన్చార్జి అర్షం సుధాకర్ మాదిగ,ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ కొత్తగట్టు నూతన గ్రామ కమిటీని ఎన్నుకోన్నారు.అధ్యక్షులు కన్నం నాగరాజు మాదిగ,అధికార ప్రతినిధి,కన్నం కిరణ్ మాదిగ,ఉపాధ్యక్షులు బొజ్జ సిద్దు మాదిగ, కన్నం సదానందం మాదిగ. ప్రధాన కార్యదర్శి కన్నం అశోక్ మాదిగ మామిడిపల్లి కృష్ణ మాదిగ,కార్యవర్గ కమిటీ సభ్యులు కన్నం రమేష్ మాదిగ సవడి అనిల్ మాదిగ కన్నం యుగంధర్ మాదిగ సిశాల్ మాదిగ కన్నం రాజు మాదిగ బుజ్జ చిరంజీవి మాదిగ బొజ్జ బాబు మాదిగ కన్నం పోచయ్య మాదిగ,ఎంఎస్పీ గ్రామ కమిటీ అధ్యక్షులు కన్నం అశోక్ మాదిగ ఉపాధ్యక్షులు బొజ్జ కొమురయ్య మాదిగ ప్రధాన కార్యదర్శి మామిడిపల్లి సుమన్ మాదిగ అధికార ప్రతినిధి బొజ్జ కిరణ్ మాదిగ బొజ్జ రమేష్ మాదిగ ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కన్నం నవీన్ మాదిగ ఆత్మకూరు మండల మాజీ కార్యదర్శి అర్షం విక్రమ్ మాదిగ, మండల నాయకులు అర్షం ప్రశాంత్ మాదిగ తదితరులు పాల్గొన్నారు

# ఐబీ భూముల సమస్య పరిష్కారానికి సర్వే

## 13న డిండి గ్రామంలో భూముల పరిశీలన

**దిండి,(గుండ్లపల్లి), ఆగస్టు 12, నేటి శుభోదయ :** డిండి గ్రామంలోని ఐబీ భూముల సమస్య పరిష్కారానికి అధికారులు గురువారం (ఆగస్టు 13) సర్వే నిర్వహించనున్నట్లు డిండి సర్పంచ్ నల్లగంతుల రవి తెలిపారు.డిండి మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ సూచన మేరకు ఐబీ భూముల సమస్యపై సర్వే నిర్వహించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు సంబంధిత అధికారులు గురువారం ఐబీ భూములను పరిశీలించి సర్వే ప్రక్రియ చేపట్టనున్నారని తెలిపారు.సర్వేకు సంబంధించిన రైతులు తమ భూములకు సంబంధించిన పట్టాలు, పత్రాలు, ఇతర ఆధారాలతో సర్వే జరిగే ప్రదేశానికి హాజరై అధికారులకు సహకరించాలని సర్పంచ్ కోరారు. సమస్యకు సంబంధించిన పూర్తి వివరాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు బాధిత రైతులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సర్వేను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు."ఐబీ భూముల సమస్య పరిష్కారం కోసం రైతులకు అండగా నిలిచి, అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లేందుకు కృషి చేస్తాం" అని సర్పంచ్ నల్లగంతుల రవి తెలిపారు.



# ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలి : USPC డిమాండ్

**- సిరికొండ తహసీల్దార్‌కు విజ్ఞాపన పత్రం సమర్పణ**



**నిజామాబాద్ రూరల్, ఆగస్టు 12, నేటి శుభోదయ :** పాఠశాల విద్యలో ఎదురవుతున్న దీర్ఘకాలిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, పీఆర్సీ (PRC) నివేదికను తెప్పించుకొని అమలు చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న డీఏ (DA)లను వెంటనే విడుదల చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (USPC) నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సిరికొండ మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ గారికి వారు విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు ఎమ్ బాలయ్య మాట్లాడుతూ.. బోధనేతర, ఆన్‌లైన్ పనుల భారంతో టీచర్లు తరగతి గది బోధనకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. USPC పిలుపు మేరకు చేపట్టిన దశల వారీ ఆందోళనల్లో భాగంగా ఇప్పటికే నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతున్నామని, సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఈ నిరసన కొనసాగుతుందని తెలిపారు. అందులో భాగంగానే ఈరోజు తహసీల్దార్ గారి ద్వారా గౌరవ ముఖ్యమంత్రి గారికి మెమోరాండం పంపినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో USPC నాయకులు ఎం. బాలయ్య, బి. దేవిసింగ్, కె. రవి, టి. సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

# డిండి మండల సమగ్ర అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు

- రైతులకు పట్టాలు.. ప్రతి గ్రామానికి తాగునీరు.. అర్హులందరికీ పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు
- మండల స్థాయి సమీక్షలో ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్




**దిండి, ఆగస్టు 12, నేటి శుభోదయ :** డిండి మండలంలోని ప్రతి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ సూచించారు. బుధవారం డిండి ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి సమీక్ష సమావేశంలో వివిధ శాఖల పనితీరు, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలుపై ఆయన సమీక్షించారు.ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ అధికారులు అర్హత కలిగిన రైతులకు భూ పట్టాలు అందించే ప్రక్రియను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే సూచించారు. పట్టాలు పొందిన రైతులు రైతు భరోసా, రైతు బీమా తదితర పథకాలకు దరఖాస్తు చేసుకునేలా, ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఉపాధి హామీ పనులతో గ్రామాల అభివృద్ధిఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో అవసరమైన అభివృద్ధి పనులను చేపట్టాలని సూచించారు. జలసిరి పనులతో పాటు గొర్రెలు, బర్రెల షెడ్లు, పండ్ల తోటల ఏర్పాటుకు అర్హత ఉన్న వారికి గ్రామపంచాయతీ తీర్మానాల ద్వారా అవకాశాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

**ప్రతి గ్రామానికి తాగునీరు అందాలి :** మిషన్ భగీరథ ద్వారా మండలంలోని ప్రతి గ్రామానికి నిరంతరంగా సురక్షిత తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అన్నారు. పైపులైన్లు, మోటార్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. డిండి ప్రాజెక్టు నుంచి వ్యవసాయ అవసరాలకు నీటిని విడుదల చేసినందున రైతులు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని కోరారు.

**అర్హులందరికీ సంక్షేమ పథకాలు**

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు తదితర సంక్షేమ పథకాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలు, బీడీ, గీత, చేనేత కార్మికులు తదితర అర్హులైన వర్గాలను గుర్తించి పెన్షన్లు అందేలా చూడాలన్నారు.

**ఇందిరమ్మ ఇళ్లపై సమీక్ష**

డిండి మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను సమీక్షించిన ఎమ్మెల్యే.. పెండింగ్‌లో ఉన్న ఇళ్లను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. మండలంలో 45 గుడిసెలను అధికారులు గుర్తించారని, వాటికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసే చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం ఇళ్ల నిర్మాణం జరగాలని, స్లాబ్ ఏరియా 750 చదరపు అడుగుల లోపు ఉండేలా చూడాలని సూచించారు.

**మహిళా సంఘాలు, పశుసంవర్ధక రంగానికి ప్రోత్సాహం**

మహిళా సంఘాలను మరింత బలోపేతం చేసి స్వయం ఉపాధి, జీవనోపాధి అవకాశాలను కల్పించాలని ఎమ్మెల్యే అన్నారు. పశుసంవర్ధక శాఖ ద్వారా రైతులకు పశువైద్య సేవలు, టీకాలు, పశుపోషణపై అవగాహన కల్పిస్తూ పాడి, గొర్రెలు, మేకల పెంపకాన్ని ప్రోత్సహించాలని సూచించారు.

**నల్లగొండ–డిండి డబుల్ రోడ్డు పనులు**

హెచ్ఏఎం (HAM) పద్ధతిలో నల్లగొండ నుంచి డిండి వరకు డబుల్ రోడ్డు పనులను మొదటి విడతలోనే పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే బాలు నాయక్ తెలిపారు. రహదారి పూర్తయితే డిండి మండలంతో పాటు దేవరకొండ నియోజకవర్గ ప్రజలకు రవాణా సౌకర్యం మరింత మెరుగుపడుతుందని అన్నారు.

"డిండి మండల సమగ్ర అభివృద్దే లక్ష్యం. రైతులు, మహిళలు, పేదలు, విద్యార్థులు, కార్మికులు, ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎలాంటి జాప్యం ఉండకూడదు" అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.సమావేశంలో డీఎల్పీవో, ఎంపీడీఓ, తహసీల్దార్, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, గ్రామ కార్యదర్శులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# కేసులకు భయపడేది లేదు పోరాటం ఆపేది లేదు

**- బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నరవోయిన శ్రీనివాస్**




**నిజామాబాద్ రూరల్, ఆగస్టు 12, నేటి శుభోదయ :** ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, ఎన్ని అక్రమ కేసులు పెట్టినా తాము భయపడేది లేదని బీఆర్ఎస్ సిరికొండ మండల అధ్యక్షుడు నరవోయిన శ్రీనివాస్ అన్నారు. ప్రజా సమస్యలపై శాంతియుతంగా నిరసన తెలిపిన తమపై కేసులు నమోదు చేయడం కక్ష సాధింపు చర్యల్లో భాగమేనని ఆయన ఆరోపించారు. సిరికొండలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసిన ఘటనపై ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. శాంతియుత నిరసనపై కేసులు సరికాదు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా, ప్రజలకు, పోలీసులకు, ప్రజా వ్యవస్థకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం జరగకుండా శాంతియుతంగా నిరసన చేపట్టామని శ్రీనివాస్ తెలిపారు. అలాంటి నిరసనపై కేసులు నమోదు చేయడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. పోలీసుల వ్యవహారశైలిపై విమర్శలు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోలీసులు ప్రభుత్వానికి తొత్తులుగా వ్యవహరిస్తున్నారనే భావన ప్రజల్లో కలుగుతోందని ఆయన విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ నిరసన తెలిపే హక్కు ప్రతిపక్షాలకు, ప్రజలకు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలోనూ ప్రతిపక్షాలు అప్పటి ముఖ్యమంత్రి దిష్టిబొమ్మలను దహనం చేసిన సందర్భాలు ఉన్నాయని, అదేవిధంగా కాంగ్రెస్ నాయకులు సైతం గతంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దిష్టిబొమ్మలను దహనం చేసిన సందర్భాలు ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. ప్రజాస్వామ్య హక్కులను అణచివేయడం సరికాదు బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు అధికారంలో ఉన్న సమయంలో కాంగ్రెస్, బీజేపీ నాయకులపై ఎలాంటి కేసుల సంస్కృతిని ప్రోత్సహించలేదని శ్రీనివాస్ పేర్కొన్నారు. దిష్టిబొమ్మ దహనం వంటి రాజకీయ నిరసనలపై కేసులు పెట్టడం ద్వారా ప్రజాస్వామ్య హక్కులను అణచివేయడం సరికాదన్నారు. ఈ విధమైన కేసులకు భయపడేది లేదని హెచ్చరించారు

# విద్యా హక్కుల సాధనకు (బిపిఎస్) రిలే నిరాహార దీక్షలు

**-రాష్ట్ర కన్వీనర్ నల్ల లక్ష్మణ్,రంగారెడ్డి ఇంచార్జ్ బైరపాక బీముడు**

**తలకొండపల్లి, ఆగస్టు 12, నేటి శుభోదయ :** విద్యా హక్కుల చట్టాన్ని సమర్థంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్ ఇందిరా పార్క్ దగ్గర బహుజన ప్రజా శక్తి ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ నెల 16 నుంచి ఆగస్టు 31 వరకు కొనసాగనున్న ఈ కార్యక్రమంలో ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనారిటీలు, అణగారిన వర్గాల విద్యార్థుల హక్కుల కోసం ఉద్యమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.బి పి ఎస్ రాష్ట్ర కన్వీనర్ నల్ల లక్ష్మణ్, రంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ భైరపాక బీముడు మాట్లాడుతు..విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు కల్పించాలని, విద్యకు తగినన్ని నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రతి మండల కేంద్రంలో గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయాలని, IIT–JEE, NEET, EAMCET, UPSC వంటి పోటీ పరీక్షలకు ఉచిత కోచింగ్ అందించాలని కోరారు.అలాగే ప్రైవేట్ విద్యాసంస్థల్లో పేద, అణగారిన వర్గాల విద్యార్థులకు నిర్దేశిత శాతం సీట్లు కల్పించాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్,స్కాలర్‌షిప్‌లను సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు.ఈ  కార్యక్రమంలో పలువురు నాయకులు, మహిళలు, విద్యార్థులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విద్యా హక్కుల సాధన కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాణి పుష్పమణి,ఇంతియాజ్ ఫాషాదీక్షితులు,గురువయ్య,రవి కుమార్ బాలకృష్ణ, సునిత, రాజు,రవి,రజక సంఘం రాష్ట్ర నాయకుడు, గోపి,నాగర్‌కర్నూల్ (జిల్లా). ఇన్–చార్జ్ లుఇటికాల,రాణి,గోపిసాలయ్య,మణెమ్మ రాకేష్ అమన్గల్ సామెల్ తదితరులు పాల్గొన్నారు.

## వరి రైతులు బోనస్ కోసం ఆన్లైన్ నమోదు చేసుకోవాలి

**- మండల వ్యవసాయ అధికారి అనూష**



**ముత్తారం, ఆగస్టు 12, నేటి శుభోదయ :** తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన ఏడు రకాల సన్న రకం వరి విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు తప్పనిసరిగా తమ వివరాలను ఆన్లైన్లో నమోదు చేసుకోవాలని,రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన విత్తన దుకాణాలను సంప్రదించి తమ వివరాలను నమోదు చేసుకోవాలని ఇందుకోసం పట్టా పాస్ బుక్,ఆధార్,విత్తన కొనుగోలు చేసిన పత్రాలను తీసుకెళ్లాలని,అదేవిధంగా ప్లాంట్ లేదా ఇతర రైతుల వద్ద నుంచి విత్తనాలు తీసుకొని సాగు చేసిన రైతులు తమ గ్రామానికి సంబంధించిన వ్యవసాయ విస్తరణ అధికారులైన ఏఈఓ లను సంప్రదించి వివరాలను నమోదు చేసుకోవాలని,ప్రభుత్వం ప్రకటించిన బోనస్ పొందేందుకు అర్హత కలిగిన రైతులందరూ ఈ ప్రక్రియను త్వరగా పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి అనూష ఒక ప్రకటనలో తెలిపారు.

# మోడీ విధానాలతో అప్పుల ఊబిలోకి దేశం

**- యువతను విస్మరిస్తే పతనం తప్పదు.**






**ఏన్కూర్, ఆగస్టు 12, నేటి శుభోదయ :** మోడీ విధానాలతో దేశం రోజురోజుకు అప్పుల ఊబిలో కూరుకు పోతుందని దశాబ్ద కాలంలో 55 లక్షల కోట్ల నుంచి 205 లక్షల కోట్లకు అప్పు పెరిగిపోయిందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు ఆరోపించారు .ఆదాయ రంగాలను కార్పోరేట్ సంస్థలకు కట్టబెట్టి దేశాన్ని ప్రైవేటు పరం చేసే పనిలో మోడీ ప్రభుత్వం నిమగ్నమైందని ఆయన ధ్వజమెత్తారు.ప్రజా చైతన్య యాత్రలో భాగంగా బుధవారం ఏన్కూర్ మండలంలో జరిగింది మూల పోచారం గ్రామంలోకి యాత్ర ప్రవేశించగానే సాంప్రదాయ దుస్తులు ధరించిన గిరిజన మహిళలు యాత్రకు ఘన స్వాగతం పలికారు యాత్రకు నేతృత్వం వహిస్తున్న వారికి పూల మాలలు వేసి స్వాగతం పలికారు యాత్ర మూల పోచారం, రామ్ నగర్ తండా, రాజలింగాల, తిమ్మారావుపేట, బురద రాఘవాపురం , టిఎల్ పేట, ఏన్కూర్, జన్నారం, నూకలంపాడు గ్రామాల్లో సాగింది .ఈ సందర్భంగా జరిగిన వివిధ సభలలో హేమంత్ రావు మాట్లాడుతూ.... మోడీ విధానాలు దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడమే కాక దేశ విచ్చినానికి కారణమవుతున్నాయన్నారు. దేశంలో నిరుద్యోగం పెరిగిపోయిందని దశాబ్ద కాలంగా ప్రభుత్వ సంస్థల్లో నియామకాలు జరగలేదని హేమంతరావు తెలిపారు. ఉత్పాదకరంగంతోపాటు వ్యవసాయ రంగం కూడా సంక్షోభంలో కూరుకుపోయిందని రైతులు కూలీలుగా మారుతున్నారని పంట భూములపై కార్పోరేట్ కన్ను పడిందన్నారు. దేశానికి వెన్నుముకగానిలిచిన నవరత్నాలు అనదగిన జాతీయ సంస్థలను ప్రైవేటుకు ధారా దత్తం చేశారని రైల్వేలు ఓడరేవులు విమానయానం అదానికి అప్పగించిన మోడీ కార్పొరేట్లను తప్ప ప్రజల గురించి పట్టించుకోవడం లేదన్నారు. యువతను మోడీ పట్టించుకోవడంలేదని విధి రాత అంటూ నిరుద్యోగం ఆర్థిక సంక్షోభం నుంచి తనను తాను తప్పించుకునే యత్నంలో ఉన్నారని యువతను విస్మరిస్తే పతనం తప్పదని హేమంతరావు హెచ్చరించారు. ఇప్పటికే జంతర్ మంతర్ ఆందోళన తర్వాత మోడీ దిగిరాక తప్పలేదని ముందు ముందు మోడీ ప్రభుత్వం ప్రజలకు జవాబు చెప్పాల్సి ఉంటుందని ఆయన అన్నారు .అవినీతిలో మోడీ సర్కారు కూరుకుపోయిందని ఆఖరికి అయోధ్య రామాలయం నిధులకు ఎసరు పెట్టారని హేమంతరావు ఆరోపించారు .రాష్ట్రంలో కాంగ్రెస్ ఆశలు సన్నగిల్లుతున్నాయని హామీలు నెరవేర్చే దిశగా కాంగ్రెస్ పాలన సాగడం లేదన్నారు .రోజుకో వివాదంతో ప్రజా విశ్వాసాన్ని కోల్పోతుందని హేమంతరావు తెలిపారు. హామీ లఅమలు విషయంలో ఇటీవల ప్రభుత్వ పెద్దలు ఎవరు మాట్లాడడం లేదని రుణమాఫీ విషయంలో రైతులను వంచించారన్నారు. మహిళలు యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని హేమంతరావు అన్నారు. ప్రజలను చైతన్యవంతం చేసేందుకు యాత్రలను నిర్వహిస్తున్నామని పాలకవర్గాలు స్పందించకపోతే పోరాట కార్యాచరణను రూపొందించుకొని ప్రజలను సమీకరించి ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతామన్నారు. సిపిఐ నిర్వహిస్తున్న పాదయాత్ర ముగింపు సభ ఖమ్మం లో జరుగుతుందని ఈనెల13న జరిగే ముగింపు సభకుసిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనం నేని సాంబశివరావు హాజరవుతారని హేమంతరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, నియోజకవర్గ కార్యదర్శి ఎర్ర బాబు, రాష్ట్ర సమితి సభ్యులు ఏపూరి లతా దేవి ,జిల్లా కార్యవర్గ సభ్యులు సింగు నరసింహారావు, పోటు కళావతి ,మండల కార్యదర్శి జాగర్లమూడి రంజిత్ కుమార్, యాంగల ఆనందరావు, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు బత్తినేని నీరజ, గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు బనోత్ రాంబాబు ,ఏ ఐ వై ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రవణ్ కుమార్ ,మండల నాయకులు అమరనేని వీరభద్రం, మంకెన కృష్ణ, తెప్పల సత్యం , మాదినేని వెంకన్న, పొన్నం రాంబాబు సొలం రాజు , లక్పతి, భీమేష్, అరుణ్, సైద, బోగినబోయిన నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

# కొండాపూర్ చెరువు కట్ట మరమ్మతులు, శిఖం భూముల రక్షణకై అధికారులకు వినతిపత్రం సమర్పణ



**నిజామాబాద్ రూరల్, ఆగస్టు 12, నేటి శుభోదయ :** సిరికొండ మండల పరిధిలోని కొండాపూర్ గ్రామంలో ఇటీవల తెగిపోయిన చెరువు కట్టకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని, అలాగే చెరువులో ఆక్రమణకు గురైన శిఖం భూములను సర్వే చేసి చెరువును పరిరక్షించాలని కోరుతూ గ్రామ నాయకులు, ప్రజాప్రతినిధులు కలిసి మండల మరియు జిల్లా అధికారులకు వినతిపత్రం అందజేశారు.గ్రామ సర్పంచ్ భర్త శ్రీధర్, VDC చైర్మన్ ఆకుల శ్రీనివాస్ నేతృత్వంలో గ్రామంలోని అన్ని కులాల పెద్దలు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు పార్టీలతీతంగా ఒక్కటై అధికారులను కలిసి విన్నవించారు. చెరువు కట్ట తెగిపోవడంతో నీరంతా వృథాగా పోతోందని, వర్షాకాలంలో రైతులకు తీవ్ర అన్యాయం జరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే చెరువు శిఖం భూములు ఆక్రమణకు గురికావడం వల్ల చెరువు నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతోందని, కావున తక్షణమే అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించి, కట్ట మరమ్మతు పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు అబ్బాస్, ఆకుల జగన్, ముక్కెర సంతోష్, రహీం, కళ్యాణ్ గౌడ్, చంద్రగౌడ్ మరియు పలువురు గ్రామ పెద్దలు, యూత్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అపోలో ఫార్మసీలో ఉద్యోగాల జాతర...

- **100కుపైగా ఖాళీలు..**
- **14న కొత్తగూడెంలో ఉద్యోగ మేళా..**
- **19–30 ఏళ్ల నిరుద్యోగ యువతీ యువకులకు అవకాశం**
- **రూ.12,500 నుంచి రూ.25 వేల వరకు వేతనం...**



**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 12, నేటి శుభోదయ :** నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో అపోలో ఫార్మసీలో ఉద్యోగాల భర్తీకి ఈ నెల 14న ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కొండపల్లి శ్రీరామ్ తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన అపోలో ఫార్మసీలో 100కుపైగా ఖాళీలను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు.చుంచుపల్లి మండలం కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్ సమీపంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 14న ఉదయం 10 గంటలకు ఉద్యోగ మేళా ప్రారంభమవుతుందని తెలిపారు. 19 నుంచి 30 ఏళ్ల మధ్య వయసున్న నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పలు పోస్టులకు అవకాశం: ట్రైనీ ఫార్మసిస్ట్, రిటైల్ ట్రైనీ అసోసియేట్, ఫార్మసిస్ట్, ఫార్మసీ అసిస్టెంట్, ప్రొడక్ట్ అడ్వైజర్ తదితర పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. డీ.ఫార్మసీ, బీ.ఫార్మసీ, ఎం.ఫార్మసీతో పాటు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు ఆయా పోస్టులకు అర్హులని పేర్కొన్నారు. తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ ధ్రువపత్రం ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు.ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.12,500 నుంచి రూ.25,000 వరకు వేతనం లభిస్తుందని వెల్లడించారు. అభ్యర్థులు తమ బయోడేటా, విద్యార్హతల ధ్రువపత్రాలు, ఆధార్‌కార్డు ప్రతులను వెంట తీసుకురావాలని సూచించారు. అర్హత కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు ఈ ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి కొండపల్లి శ్రీరామ్ కోరారు.

Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620

# విద్యార్థి విప్లవ పతాక ఏఐఎస్ఎఫ్

- ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ నాయకులు భాగం హేమంతరావు
- స్వాతంత్ర్య సంగ్రామం లో విప్లవాగ్నిని రగిలించిన నిప్పుకణం
- ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ ఉపాధ్యక్షులు రావి శివరామకృష్ణ






**ఖమ్మం, ఆగస్టు 12, నేటి శుభోదయ :** స్వాతంత్ర్య సంగ్రామంలో విప్లవ వాగ్ని రగిలించిన నిప్పుకణం, ప్రత్యేక తెలంగాణ సాధనకు తొలి దశ,మలి దశ ఉద్యమం లో వీరోచిత పోరాటం చేసిన సంఘం,దేశ చరిత్రలో ఎందరో త్యాగధనులను అందించిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ నాయకులు భాగం హేమంతరావు, మాజీ జాతీయ ఉపాధ్యక్షులు రావి శివరామకృష్ణ, మాజీ రాష్ట్ర ఓరుగంటి శేషగిరిరావు, పేర్కొన్నారు. స్థానిక ఖమ్మం నగరంలోని ఎస్ ఆర్ అండ్ బిజి ఎన్ఆర్ డిగ్రీ కళాశాల,పీ. జి కళాశాల, శాంతినగర్ కళాశాల, ముందు ఏఐఎస్ఎఫ్ 91 వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ శ్వేత అరుణ పథకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భాగం హేమంతరావు ,రావి శివరామకృష్ణ మాట్లాడుతూ అలుపెరగని సమరశీల ఉద్యమాల వేదిక, దేశానికి ఎందరో త్యాగదనులను అందించిన మొట్టమొదటి విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్. స్వాతంత్ర పోరాట స్ఫూర్తితో తెలంగాణ ఉద్యమ వారసత్వంతో నిత్యం విద్యా రంగంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై అలుపెరిగని పోరాటాలు నిర్వహిస్తున్న విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని వారు అన్నారు.స్వాతంత్రం మా జన్మ హక్కు అంటూ స్వాతంత్రం కోసం జరిగిన సంగ్రామంలో ఉద్యమించిన మొట్టమొదటి విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్, 1936 ఆగస్టు 12 ఉత్తర ప్రదేశ్ లక్నో నగరంలో ఏర్పాటు కాబడి నేటికీ 90సంవత్సరాలు పూర్తి చేసుకుని 91వ వసంతాలు అడిగిపెట్టి సుదీర్ఘ ఉద్యమ చరిత్ర కలిగిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని,మెకాలే విద్యా విధానం మాకొద్దంటూ విద్యారంగంలో సంస్కరణల కోసం పోరాడి, కొఠారి కమిషన్ సిఫారసుల అమలు చేయాలని పోరాటం చేసిన ఘనమైన చరిత్ర ఏఐఎస్ఎఫ్ దే అన్నారు . చదువుతూ పోరాడు చదువు కై పోరాడు అన్న నినాదంతోని విద్య రంగ పరిరక్షణ కోసం బహుముఖ పోరాటాన్ని నిర్వహించింది. ముఖ్యంగా యూనివర్సిటీలు భావ్య సమాజంలో మతోన్మాదులకు వ్యతిరేకంగా పోరాడిన చరిత్ర ఏఐఎస్ఎఫ్ సొంతం అన్నారు.ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా నాయకులు ఐఏఎల్ జిల్లా కార్యదర్శి ఓరుగంటి శేషగిరిరావు మాట్లాడుతూపెరుగుతున్న ధరల అనుగుణంగా మెస్ చార్జీలు,స్కాలర్షిప్స్ పెంపు కోసం అనేక పోరాటాలు నిర్వహించింది. మహిళలపై జరుగుతున్న దాడులకు, అస్లీల సాహిత్యానికి వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించినది ఏఐఎస్ఎఫ్అన్నారు.స్వాతంత్ర పోరాట స్ఫూర్తితో తెలంగాణ పోరాట వారసత్వాన్ని పునికి పుచ్చుకొని పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తెలంగాణ మలిదశ ఉద్యమంలో ఏఐఎస్ఎఫ్ పోరాటం చారిత్రకమైనదనీ,కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ విద్యా సంస్థలకు ఊడిగం చేస్తూ జాతీయ నూతన విద్యా విధానం పేరుతో విద్యా వీధానాన్ని ధ్వంసం చేసే కుట్రలను తిప్పికొట్టాలన్నారు.ప్రవేట్ యూనివర్సిటీల బిల్లును తీసుకొచ్చి, ప్రభుత్వ విశ్వవిద్యాలయాల విద్య వ్యవస్థను విచ్ఛిన్నమ్ చేయాలని చూస్తున్న పాలకులకు బుద్ధి చెప్పాలనీ,ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం ఉద్యమించి, ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు .దేశ చరిత్రలో అటల్ బిహారీ వాజ్పేయి, జవహర్లాల్ నెహ్రూ, మహమ్మద్ అలీజిన్నా లాంటి మహా మహా మేధావులను దేశానికి అందించిన చరిత్ర ఏఐఎస్ఎఫ్ కి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎర్ర బాబు, ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు చేబ్రోలు ఇంద్రసేన, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడపల్లి లక్ష్మణ్, జిల్లా ఉపాధ్యక్షులు షేక్ నాగుల్ మీరా జిల్లా సహాయ కార్యదర్శులు బూర మనోజ్, జిల్లా నాయకులు పవన్ నాగ శేషు కళాశాల విద్యార్థులు సుదీప్ మణికంఠ గోపి చంద్ నరేంద్ర మోహన్ అశోక్ సౌమ్య మౌనిక రమ్య ప్రవళిక ప్రజ్ఞప్రియ తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా సందర్శించిన పోలీస్ కమిషనర్ సునీల్ దత్




**ఖమ్మం, ఆగస్టు 12, నేటి శుభోదయ :** నేరాల పరిశోధన, నిందితుల గుర్తింపును వేగవంతం చేయడానికి క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్వర్క్ సిస్టమ్స్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పోలీస్ అధికారులకు ఆదేశించారు. బుధవారం ఖమ్మం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా చేరుకున్న పోలీస్ కమిషనర్ బాధిత ఫిర్యాదుదారులతో మాట్లాడారు. అనంతరం స్టేషన్ నిర్వహణ, పోలీసుల పనితీరు, విచారణ నివేదికలు, సిసిటిఎన్ ఎస్ అప్లోడ్, జనరల్ డైరీ రికార్డులను, సీజ్ చేసిన వాహనాలు, పరిసరాలను పరిశీలించారు.ఈ సందర్భంగా క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్వర్క్ సిస్టమ్స్ లో వస్తున్న అధునాతన పద్దతులను అందిపుచ్చు కోవాలాని సిబ్బందికి సూచించారు. పోలీస్ స్టేషన్లలో డేటా నమోదు, దర్యాప్తు ప్రక్రియలో పారదర్శకత, సాంకేతికతను మెరుగుపరచడంలో ఈ వ్యవస్థ అత్యంత కీలకమని స్పష్టం చేశారు. జిల్లాలో వివిధ రకాల నేరాలకు పాల్పడుతున్న వారిని కనిపెట్టేందుకు ఈ ప్రాజెక్టులో నూతన పద్ధతులు ప్రవేశపెడుతున్నారని , వాటిపై పరిణితి సాధించాలని సూచించారు. ఉన్నతాధికారులు ప్రాజెక్టును సమర్ధవంతంగా ఉపయోగించాలని, తద్వారా క్రింది స్థాయి సిబ్బంది మరింత మెరుగ్గా వినియోగించేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రాజెక్టులో భాగంగా ఈ–సమన్స్, ఈ–సాక్ష్యా వంటి వాటిని విస్తృతంగా ఉపయోగించాలని వివరించారు. రౌడీ షీటర్ల ను కౌన్సిలింగ్ చేయాలని, అదేవిదంగా నిఘా పెట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో టౌన్ ఏసీపీ రమణమూర్తి పాల్గొన్నారు.

# 4వ డివిజన్‌లో మున్సిపల్ కమిషనర్ ఆకస్మిక పర్యటన

- ప్రజలతో మాట్లాడి పారిశుధ్య సేవలపై వివరాల సేకరణ, రూట్ మ్యాప్, లాగ్‌బుక్‌ల పరిశీలన
- చెత్త సేకరణకు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని సిబ్బందికి ఆదేశాలు



**ఖమ్మం, ఆగస్టు 12, నేటి శుభోదయ :** ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలోని 4వ డివిజన్‌లో మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా డివిజన్‌లో పారిశుధ్య నిర్వహణ, ఇంటింటి చెత్త సేకరణ, కాలువల శుభ్రత తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.పర్యటనలో భాగంగా స్థానిక ప్రజలతో కమిషనర్ మాట్లాడి ట్రాక్టర్, ఆటోలు ఏ సమయంలో వస్తున్నాయి, ప్రతిరోజూ తమ ప్రాంతానికి చెత్త సేకరణ వాహనాలు వస్తున్నాయా లేదా, కాలువలను ఎప్పుడు శుభ్రం చేశారు, బుష్‌లను ఎప్పుడు తొలగించారు అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు పారిశుధ్య సేవలు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే విషయాన్ని నేరుగా ప్రజల నుంచే తెలుసుకున్నారు.అనంతరం పారిశుధ్య జవాన్, వర్కర్లు, డ్రైవర్లతో మాట్లాడి ప్రతిరోజూ ఏ సమయంలో విధులకు హాజరవుతున్నారు, కేటాయించిన ప్రాంతాల్లో ఏ సమయానికి చెత్త సేకరణ చేస్తున్నారు, తమకు నిర్దేశించిన రూట్ మ్యాప్ ఉందా, దాని ప్రకారం వాహనాలు తిరుగుతున్నాయా అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా సిబ్బంది నిర్వహిస్తున్న డైలీ రూట్ మ్యాప్ బుక్స్, రూట్ మ్యాప్ రిజిస్టర్లను కమిషనర్ పరిశీలించారు. అలాగే చెత్త సేకరణ వాహనాల లాగ్‌బుక్‌ను పరిశీలించి ప్రతిరోజూ ఆటో, ట్రాక్టర్ ఏయే ప్రాంతాలకు వెళ్తున్నాయి, కేటాయించిన రూట్ ప్రకారం చెత్త సేకరణ జరుగుతోందా అనే వివరాలను పరిశీలించారు.ప్రతిరోజూ ఉదయం ట్రాక్టర్లు, ఆటోలు తమకు కేటాయించిన రూట్ మ్యాప్ ప్రకారం ప్రతి ఇంటి నుంచి చెత్తను తప్పనిసరిగా సేకరించాలని కమిషనర్ ఆదేశించారు. ఏ ప్రాంతంలోనూ చెత్త సేకరణకు అంతరాయం లేకుండా, నిర్దేశించిన సమయంలో వాహనాలు తప్పనిసరిగా ఆయా ప్రాంతాలకు చేరుకునేలా చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. అదే విధంగా డివిజన్‌లోని కాలువల్లో పేరుకుపోయిన మట్టి, పూడిక, గడ్డి, నీ పూర్తి స్థాయిలో తొలగించాలని ఆదేశించారు. కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయి నీటి ప్రవాహానికి ఆటంకం కలగకుండా వాటిని ఎప్పటికప్పుడు తొలగించాలని, ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా కాలువలను నిరంతరం శుభ్రంగా ఉంచాలని జవాన్, పారిశుధ్య సిబ్బందిని కమిషనర్ ఆదేశించారు. పారిశుధ్య సిబ్బంది తమకు కేటాయించిన రూట్‌లో సమయపాలనతో విధులు నిర్వహిస్తూ, ఇంటింటి చెత్త సేకరణను ఎలాంటి అంతరాయం లేకుండా పూర్తి చేయాలని కమిషనర్ సూచించారు. వాహనాలు నిర్దేశిత రూట్‌లో తిరుగుతున్నాయా లేదా అనే విషయాన్ని నిరంతరం పర్యవేక్షించాలని జవాన్ ని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన పారిశుధ్య సేవలు అందించడమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో ఆకస్మిక పర్యటనలు, తనిఖీలు కొనసాగుతాయని, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతాయుతంగా పనిచేయాలని కమిషనర్ స్పష్టం చేశారు.

# అభివృద్ధి పనులను పరిశీలించిన ఖమ్మం సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గ ప్రసాద్

**ఖమ్మం, ఆగస్టు 12, నేటి శుభోదయ :** ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలోని 18వ డివిజన్, రోడ్ నంబర్ 10, శ్రీరామ్ నగర్ నందు వివిధ ఎల్.ఆర్.ఎస్, మున్సిపల్ జనరల్,సుడా, అర్బన్ డెవలప్మెంట్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ నిధుల ద్వారా మొత్తం రూ. నాలుగు కోట్ల 15 లక్షల 60000 వేల తో చేపడుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో ఖమ్మం సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్ పరిశీలించారు.సంబంధిత మున్సిపల్, సుడా అధికారులతో కలిసి 18వ డివిజన్‌లో పర్యటించి నూతనంగా నిర్మిస్తున్న సీసీ కాలువలు, కల్వర్టులు, సీసీ రోడ్లు తదితర అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. అనంతరం డివిజన్ లో రోడ్ల పై అక్రమంగా నిర్మించుకున్న ర్యాంపులు, దుకాణాలను, వెంటనే తొలగించాలని సంబంధిత టౌన్ ప్లానింగ్ టి.పి.ఎస్ మరియు టి.పి.బి.ఓ లకు ఆదేశించారు. నూతనంగా నిర్మించే కాలువలకు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని విద్యుత్ అధికారులను కోరారు. ఈ సందర్భంగా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గ ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు తెలిపారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.అలాగే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులను సమన్వయంతో చేపట్టి, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. డివిజన్ మాజీ కార్పొరేటర్, డివిజన్ నాయకులు విజ్ఞప్తి మేరకు కాల్వకట్ట పై నివసించే పేద కుటుంబాల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చేసే విధంగా సహకారం అందిస్తానని అన్నారు. డివిజన్ మాజీ కార్పొరేటర్, నాయకులు ముఖ్యఅతిథికి శాలువా కప్పి సత్కరించారు. ఈ పర్యటనలో ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతరావు, సిటీ కాంగ్రెస్ ప్రెసిడెంట్ నాగండ్ల దీపక్ చౌదరి,నగర మాజీ మేయర్ పునుకొల్లు నీరజ, మాజీ కార్పొరేటర్ మందడపు లక్ష్మీ మనోహర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య,మాజీ కార్పొరేటర్ సీనియర్ నాయకులు కమర్తపు మురళి,కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ గౌస్, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ అధ్యక్షులు హుస్సేన్,మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యానవన అధికారి బెల్లం రాధిక,సుడా, ఇంజినీరింగ్ ఇంచార్జ్ ఈ.ఈ మురళి,డి.ఈ శ్రీనివాస్, ఏ.ఈ.నరేంద్ర తేజ, షామా, టౌన్ ప్లానింగ్ టీ.పీ.ఎస్ రోజా రెడ్డి,టి.పి.బి.ఓ దివ్య,శానిటేషన్ విభాగాల అధికారులు, 18 వ డివిజన్ ముఖ్య నాయకులు కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

# స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ శ్రీనగర్‌లో ఈవిఎం లతో "లీడర్ లాంఛ్-2026 "ఎన్నికలు




**ఖమ్మం, ఆగస్టు 12, నేటి శుభోదయ :** స్థానిక శ్రీనగర్ కాలనీలోని స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ స్కూల్‌లో విద్యార్థులకు ఎన్నికల పట్ల అవగాహన కల్పించుటకు నిర్వహించిన మాక్ ఎన్నికలు "లీడర్ లాంఛ్`2026" కార్యకమానికి ముఖ్య అతిథులుగా బి.రామానుజం అడిషనల్ డి.సి.పి ఖమ్మం విచ్చేసి స్కూల్ డైరెక్టర్ కొండా శ్రీధర్‌రావు తో కలిసి జ్యోతి పజ్వలన చేసి విద్యార్థి ఎన్నికలను ఘనంగా ప్రారంభించారు. పోలింగ్ ప్రక్రియను పరిశీలించి మాక్ ఎన్నికల నిర్వహణ అధికారులను, యాజమాన్యాన్ని అభినందించడం జరిగింది. "లీడర్ లాంఛ్`2026" విద్యార్థి ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బి.రామానుజం అడిషనల్ డి.సి.పి ఖమ్మం మాట్లాడుతూ రెజొనెన్స్ స్కూల్‌ను శ్రీనగర్‌లో స్థాపించి నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పాటుపడుతూ ఎంతో మంది విద్యార్థులను ఉన్నత శిఖరాలు అధిరోహించేలా చేస్తున్న యాజమాన్యాన్ని అభినందించారు. భారత్‌దేశ భవిష్యత్తు, ఆస్తి విద్యార్థులు, యువత అని ఈ దేశానికి మంచి నాయకత్వాన్ని అందించే శక్తి విద్యార్థులకు ఉందని ఆకాంక్షించారు. భారతదేశ ఎన్నికల విధానం పట్ల అవగాహన కల్పిస్తూ ప్రజాస్వామ్యంలో ఓటు ఎంత విలువైనదో తెలియజేస్తూ విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు అలవర్చుకొనుటకు మాక్ ఎన్నికలు నిర్వహించడం పట్ల సంతోషాన్ని వ్యక్త పరుస్తూ కొండా శ్రీధర్ రావు విద్యార్థుల పట్ల చూపిస్తున్న ముందు చూపును అభినందిస్తూ విద్యార్థులు ఉన్నత పౌరులుగా భావిభారత నిర్మాతలుగా ఎదుగుతారని కాంక్షిస్తూ పోటిలో ఉన్న విద్యార్థి నాయకులకు అభినందనలు, ఆశీస్సులు తెలియజేస్తూ రెజొనెన్స్ స్కూల్ శీనగర్ విద్యార్థి మాక్ ఎన్నికలలో విద్యార్థులకు ఈ.వి.యం లతో ఎన్నికలు నిర్వహించడాన్ని అభినందించారు. డైరెక్టర్ కొండా శ్రీధర్‌రావు మాట్లాడుతూ రెజొనెన్స్ స్కూల్ శ్రీనగర్ విద్యార్థిని, విద్యార్థులకు భారతదేశ ఎన్నికల విధానాలను పరిచయం చేస్తూ వారిలో ఎన్నికల పట్ల అవగాహనను, ప్రత్యక్ష అనుభూతిని కలిగిస్తూ ప్రజాస్వామిక విలువలను నాయకత్వ లక్షణాలను మంచి వ్యక్తిత్వాన్ని పెంపొందింపజేస్తూ భావిభారత పౌరులుగా తీర్చిదిద్ది సమసమాజాన్ని నిర్మించటమే ధ్యేయంగా కృషిచేస్తున్నామని తెలియజేశారు. ఎన్నికలలో విద్యార్థి నాయకులుగా పోటీలో నిలిచిన విద్యార్థిని, విద్యార్థులకు అందరితో కలిసిపోవడం, ఎదుటి వారిని నిశితంగా పరిశీలించడం, జవాబుదారితనం, కమశిక్షణ వంటి లక్షణాలు అలవర్చుకొని గొప్ప నాయకులుగా ఎదగాలని సూచిస్తూ విద్యార్థి నాయకులుగా పోటీ చేసినవారందరికి శుభాకాంక్షలు తెలియజేసారు. విద్యార్థి మాక్ ఎన్నికలలో స్కూల్ విద్యార్థి నాయకులుగా ఎస్.పి.యల్, డి.యస్.పి.యల్. క్లాసు వారిగా సి.పి.యల్. విద్యార్థులు ఎన్నిక కావడం జరిగినది. స్కూల్ విద్యార్థులు విద్యార్థి మాక్ ఎన్నికల గురించి మాట్లాడుతూ ఈ మాక్ ఎన్నికల ప్రక్రియ జాతీయ ఎన్నికల విధానాన్ని అర్థం చేసుకోవడానికి ఉపయోగపడిందని మాలో ఆత్మవిశ్వాసాన్ని, నాయకత్వ లక్షణాలను పెంపొందించేలా చేసినందుకు ఆనందాన్ని వ్యక్తం చేస్తూ పాఠశాల డైరెక్టర్ కొండా శ్రీధర్‌రావు కి కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళా కళాశాలలో ఘనంగా జాతీయ గ్రంథపాలకుల దినోత్సవం





**ఖమ్మం, ఆగస్టు 12, నేటి శుభోదయ :** ఖమ్మం పట్టణంలోని గాంధీ చౌక్ లో గల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ గ్రంథపాలకుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ జానకి రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం జాతీయ గ్రంథాలయ పితామహుడు షియాలి రామమృత రంగనాదన్ 134వ జన్మదిన సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ జానకి రామారావు గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలని సరిగ్గా వినియోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు. జీవితం లో ఉన్నత స్థానం పొందాలంటే పుస్తకాలు దోహద పడతాయని తెలిపారు. ఈ కార్యక్రమం లో గ్రంథపాలకుడు చిత్తనూరి మల్లేశం, అధ్యాపకులు రవి శంకర్, బొంద్యాలు, చేకూరి రమేష్, రామకుమార స్వామి, శ్యామల దేవి, పీడీ శ్రీనివాస్ రావ్, వేముల రామారావు, రాజేష్ కుమార్, పేరెల్లి శ్రీను, గాయత్రి, వెంకన్న, కవిత,అశోక్ కుమార్, దీప్తి, నాగమణి, రజిని, వాజీద్ పాషా, వీరాస్వామి విద్యార్థినులు పాల్గొన్నారు.

## నేతలకు ఘన సన్మానం



**ఖమ్మం, ఆగస్టు 12, నేటి శుభోదయ :** ఖమ్మం గ్రానైట్ మార్కర్ యూనియన్ ఆధ్వర్యంలో గౌరవ సలహాదారులు నరేంద్ర ఆదేశాల మేరకు ప్రెసిడెంట్ కిషన్ ఆధ్వర్యంలో ఖమ్మం గ్రానైట్ మార్కర్ యూనియన్ ఆఫీస్ లో కొత్తగా ఎన్నుకోబడిన క్వారీ లారీ డ్రైవర్లు యూనియన్ సభ్యులని బండారి మధు ప్రెసిడెంట్ వైస్ ప్రెసిడెంట్ కుంట శీను సెక్రటరీ చింతల ఉపేందర్ ని మిగతా పాలకవర్గ సభ్యుల్ని సన్మానించిన జరిగింది. అదేవిధంగా ఖమ్మం గ్రానైట్ మార్కర్ యూనియన్ సలహాదారులు నరేంద్ర క్వారీ లారీ యూనియన్ సభ్యులకి అన్న విధాలుగా అండగా ఉంటామని తెలియపరచడం జరిగింది. అదేవిధంగా ప్రెసిడెంట్ కిషన్ మీకు ఏ సమస్య వచ్చినా మా యూనియన్ అండ ఎప్పుడు మీకు ఉంటుంది అని తెలియపరచడం జరిగింది. ఈ కార్యక్రమంలో సభ్యులు వైస్ ప్రెసిడెంట్ పాషా, మరో వైస్ ప్రెసిడెంట్ భద్రం, ట్రెజరర్ సైదులు, సెక్రటరీ జానీ, ట్రెజరర్ టు రామ్మూర్తి, జాయింట్ సెక్రటరీ నరసింహారావు, ఈసీ మెంబర్ వెంకటేష్, రమేష్, రఘు, గంగరాజు, నరహరి పాల్గొన్నారు.

## చేతి వృత్తులను బలోపేతం కోసమే విశ్వకర్మ యోజన

### - బీజేపీ రాష్ట్ర నాయకులు కొండపల్లి శ్రీధర్రెడ్డి




**ఖమ్మం, ఆగస్టు 12, నేటి శుభోదయ :** చేతి వృత్తులను బలోపేతం కోసమే కేంద్రం విశ్వకర్మ యోజన పథకం ను ప్రవేశపెట్టినట్లు బీజేపీ రాష్ట్ర నాయకులు కొండపల్లి శ్రీధర్రెడ్డి పేర్కోన్నారు. నేలకొండపల్లి మండలంలోని కొత్తకొత్తూరు లో బుధవారం విశ్మకర్మ లబ్ధిదారులను కలిసి పథకం గురించి అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులను అభినందిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చేతి వృత్తిదారులు ఆత్మగౌరవంతో జీవించాలనే లక్ష్యంతో ప్రధాని మోడీ పథకం ను ప్రవేశపెట్టారన్నారు. దశాబ్దాలు గా నిర్లక్ష్యం కు గురైన చేతి వృత్తుల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు విశ్వకర్మ ను అందిస్తున్నట్లు తెలిపారు. వృత్తిదారులకు అవసనమైన పనిముట్లు నైపుణ్యాభివృద్ధి శిక్షణ తో పాటు ఆర్థిక సహాకారం అందిస్తున్నట్లు తెలిపారు. చేతి వృత్తుల పై ఆధారపడి జీవించే వారి వృత్తికి మరింత ప్రోత్సాహం కల్పిస్తున్నారని పేర్కొన్నారు. స్వయం ఉపాధి అవకాశాల ను పెంపొందించి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ను బలోపేతం చేయటమే మోడీ లక్ష్యం అన్నారు. చేతి వృత్తిదారులు విశ్వకర్మ తో ఆర్థిక స్వాలంభన సాధించాలని సూచించారు. చేతి వృత్తికి గౌరవం కార్మికుడు కు భరోసా ఆర్థిక స్వాలంభన లక్ష్యంతో పథకం ను అమలు చేస్తుందన్నారు. కేంద్ర పథకాలు ప్రతీ కుటుంబానికి చేరేలా ప్రజలలో మరింత అవగాహాన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా,నాయకులు చావా కిరణ్, అనంతు ఉపేందర్, మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్, మన్నె కృష్ణారావు, సూరేపల్లి జ్ఞానరత్నం, మల్లెబోయిన గోవిందరావు, మల్లికార్జున రావు భాజా రామకృష్ణ, దివాకర్ తదితరులు పాల్గొన్నారు

## ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి

### - జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**ఖమ్మం, ఆగస్టు 12, నేటి శుభోదయ :** ఎల్‌నినో ప్రభావం కారణంగా రానున్న వర్షపాతం తక్కువగా నమోదు అయ్యే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సూచించారు. ఎల్‌నినో పరిస్థితులు, జిల్లాలో వర్షపాతం, భూగర్భ జలాల పరిస్తితి, వ్యవసాయంపై ప్రభావం తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌నినో ప్రభావంపై వాతావరణ నిపుణుల అంచనాలు, జిల్లాలో నెలకొన్న పరిస్థితులను కలెక్టర్ వివరించారు. జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ వాతావరణ నిపుణుల అంచనాల ప్రకారం రాబోయే రెండు నుంచి మూడు నెలల్లో ఎల్‌నినో ప్రభావం బలంగా ఉండే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. రెండు మూడు రోజుల పాటు వర్షాలు కురిసిన వెంటనే సాధారణ వర్షపాతం ఉంటుందని భావించి రైతులు అధిక నీటి అవసరమయ్యే పంటల సాగుకు వెళ్లవద్దని సూచించారు. ఆకాశంలో మేఘాలు ఏర్పడినప్పటికీ ఆశించిన స్థాయిలో వర్షాలు కురిసే అవకాశం తక్కువగా ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారని తెలిపారు.రైతులు వర్షాలను మాత్రమే కాకుండా భవిష్యత్తులో నీటి లభ్యతను కూడా దృష్టిలో ఉంచుకుని పంటల సాగుపై నిర్ణయం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. తక్కువ నీటితో సాగు చేయగల పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని, నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకోకుండా నీటి ఆధారిత పంటలను సాగు చేస్తే భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని తెలిపారు. వ్యవసాయ సీజన్ ప్రారంభానికి ముందుగానే ఎల్‌నినో పరిస్థితులు, వర్షపాతం, భూగర్భ జలాల లభ్యతపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

**– భూగర్భ జలాలు 6.5 నుంచి 8 అడుగుల మేర తగ్గాయి**

గత ఏడాదితో పోలిస్తే జిల్లాలో ప్రస్తుతం భూగర్భ జల మట్టాలు సుమారు 6.5 నుంచి 8 అడుగుల మేర తగ్గాయని కలెక్టర్ తెలిపారు. బోర్లు ఉన్నాయనే కారణంతో వ్యవసాయం చేసుకోవచ్చని రైతులు భావించవద్దని సూచించారు. రానున్న నెలన్నర రోజుల్లో భూగర్భ జలాల లభ్యత మరింత తగ్గే అవకాశం ఉందని, ఈ పరిస్థితిని రైతులు ముందుగానే పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు.ప్రస్తుత పరిస్థితుల్లో నీరు అత్యంత విలువైన వనరులని, అందుబాటులో ఉన్న నీటిని ఆచితూచి వినియోగించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ తెలిపారు. వచ్చే జూలై వరకు అందుబాటులో ఉన్న భూగర్భ జలాలను త్రాగునీటి అవసరాలకు వినియోగించాల్సి ఉంటుందని అన్నారు. వ్యవసాయ అవసరాలతో పాటు భవిష్యత్తులో ప్రజల తాగునీటి అవసరాలను కూడా దృష్టిలో ఉంచుకుని నీటి వినియోగంపై జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు

**– తక్కువ నీటి అవసరమయ్యే పంటల సాగుకు ప్రాధాన్యత**

ప్రస్తుతం జిల్లాలో రైతులకు పొద్దు తిరుగుడు, పప్పు ధాన్యాలు, కంది, పెసర తదితర తక్కువ నీటి అవసరమయ్యే పంటల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. పప్పు ధాన్యాల విత్తనాలను రైతులకు 50 శాతం సబ్సిడీపై అందిస్తున్నామని అన్నారు.నీటి లభ్యతను బట్టి పంటలను ఎంపిక చేసుకునేలా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు నిరంతరం అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. రైతులు భవిష్యత్తులో ఎదురయ్యే నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో సాగు చేయగల పంటలను ఎంచుకోవాలని కోరారు. సత్తుపల్లి ప్రాంతంలో రైతులు విస్తారంగా వరి సాగు చేస్తున్నారని కలెక్టర్ తెలిపారు. అక్కడి రైతులకు ఇప్పటికే పలుమార్లు వరి సాగు చేయవద్దని సూచించామని పేర్కొన్నారు. ఎల్‌నినో పరిస్థితులు, వర్షపాతం, భూగర్భ జలాల పరిస్థితిపై వాస్తవ సమాచారాన్ని రైతులకు చేరవేయడంలో మీడియా కూడా కీలక పాత్ర పోషించాలని కలెక్టర్ కోరారు.



**– వర్షపాతం, భూగర్భ జలాల వివరాలను మీడియాకు అందించాలి**

జిల్లాలో నమోదవుతున్న వర్షపాతం, భూగర్భ జలాల పరిస్తితికి సంబంధించిన సమాచారాన్ని క్రమం తప్పకుండా మీడియాకు అందించాలని కలెక్టర్ సీపీఓను ఆదేశించారు. వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతపై ప్రజలకు, రైతులకు ఎప్పటి కప్పుడు వాస్తవ సమాచారాన్ని అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఎల్‌నినో ప్రభావంపై రైతుల్లో ముందస్తు అవగాహన కల్పించడం ద్వారా అధిక నీటి అవసరమయ్యే పంటల సాగును నియంత్రించవచ్చని, తద్వారా భవిష్యత్తులో నీటి సమస్యలను కొంతమేర నివారించవచ్చని కలెక్టర్ తెలిపారు.

**– వర్షపు నీటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు**

జిల్లాలో సోక్‌పిట్లు, కమ్యూనిటీ సోక్‌పిట్ల నిర్మాణం చేపడుతున్నామని కలెక్టర్ తెలిపారు. వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకేలా చర్యలు తీసుకోవడంతో పాటు నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు.జిల్లాలో సుమారు 80 వేల మంది రైతులను ఫామ్ పాండ్ల నిర్మాణానికి గుర్తించామని కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు సుమారు 3 వేల మంది రైతులు ఫామ్ పాండ్ల నిర్మాణానికి అంగీకారం తెలిపారని, అంగీకారం తెలిపిన రైతుల పొలాల్లో ఫామ్ పాండ్ల నిర్మాణ పనులు చేపడుతున్నామని చెప్పారు. మిగిలిన రైతులను కూడా ఫామ్ పాండ్ల నిర్మాణానికి అంగీకరించేలా అధికారులు అవగాహన కల్పిస్తూ చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.ప్రభుత్వ భవనాల్లో వర్షపు నీటి సంరక్షణ కోసం రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పిట్లను ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. వర్షపు నీటిని సమర్థవంతంగా ఒడిసిపట్టడం ద్వారా భూగర్భ జలాల పెంపునకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

**– వర్షాకాలం పూర్తయిన తర్వాతే కరువు పరిస్థితులపై నిర్ణయం**

ప్రస్తుతం జిల్లాలో తక్కువ వర్షపాతం లేదా కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని నిర్ధారించలేమని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనలు, నిర్దేశిత విధానాల ప్రకారం వర్షాకాలం పూర్తయిన అనంతరం మాత్రమే వర్షపాతం, పంటల పరిస్థితి, ఇతర సంబంధిత అంశాలను పరిశీలించి తక్కువ వర్షపాతం లేదా కరువు పరిస్థితులపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ అన్నారు. రైతులు, అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేస్తే ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే నీటి సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొనే అవకాశం ఉంటుందని తెలిపారు. అనంతరం పాత్రికేయులు ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం, భూగర్భ జలాలు, పంటల సాగు, రైతులకు అందుబాటులో ఉన్న విత్తనాలు, నీటి సంరక్షణ, తదితర అంశాలపై అడిగిన పలు ప్రశ్నలకు జిల్లా కలెక్టర్ సమాధానాలు ఇచ్చారు.

ఈ మీడియా సమావేశంలో ఇరిగేషన్ సిఈ వాసంతి, ఎస్ఈ ఎం. వెంకటేశ్వర్లు, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇ శేఖర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ధనసరి పుల్లయ్య, ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్, అధికారులు, మీడియా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## నిర్మాణ అనుమతుల సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలి

### - క్రెడాయ్ ప్రతినిధులతో సమీక్ష సమావేశంలో మున్సిపల్ కమిషనర్

**ఖమ్మం, ఆగస్టు 12, నేటి శుభోదయ :** ఖమ్మం నగరపాలక సంస్థ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో క్రెడాయ్ కన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) అధ్యక్షులు, సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. క్రెడాయ్ ప్రతినిధుల అభ్యర్థన మేరకు ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో నగరంలో నిర్మాణ అనుమతులకు సంబంధించిన పలు సమస్యలను వారు మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా టౌన్ ప్లానింగ్ విభాగం ద్వారా నిర్మాణ అనుమతుల మంజూరులో ఎదురవుతున్న సమస్యలు, జాప్యాలపై వివరించారు.క్రెడాయ్ ప్రతినిధులు వివరించిన సమస్యలపై మున్సిపల్ కమిషనర్ సానుకూలంగా స్పందించారు. టౌన్ ప్లానింగ్ అనుమతుల మంజూరు ప్రక్రియలో జాప్యం లేకుండా, నిబంధనల ప్రకారం దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.నిర్మాణ అనుమతులకు సంబంధించిన దరఖాస్తులను నిర్ణీత సమయంలో పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా ఉన్న వాటిని ఎటువంటి జాప్యం లేకుండా పరిష్కరించాలని సూచించారు. దరఖాస్తుదారులకు అనవసరమైన



ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా, సమయపాలనతో సేవలు అందించాలని అధికారులకు స్పష్టం చేశారు. క్రెడాయ్ ప్రతినిధులు తమ సమస్యలను సానుకూలంగా విని పరిష్కారానికి ఆదేశాలు జారీ చేసినందుకు మున్సిపల్ కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సమావేశంలో టౌన్ ప్లానింగ్ అధికారులు, క్రెడాయ్ అధ్యక్షులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నీటిని వృధా చేస్తే సహించేది లేదు

- జలసిరి పనులు శర వేగంగా పూర్తి చేయాలి
- ప్రతీ ఇంటా ఇంకుడు గుంత ఉండాల్సిందే
- జిల్లా పంచాయతీ అధికారి డి.వినోద్ కుమార్



**ఖమ్మం, ఆగస్టు 12, నేటి శుభోదయ :** గ్రామాలలో నీటిని ఒడిసిపట్టాలని, చుక్క నీటిని వృధా చేసిన సహించేది లేదని జిల్లా పంచాయతీ అధికారి డి.వినోద్ కుమార్ హెచ్చరించారు. మండలం లోని ఆజయ్ తండా, చెరువుమాధారం పంచాయతీలలో బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను తనిఖీ చేశారు. పలు ఇళ్లలో ఇంకుడు గుంతలను డ్రైయినేజీ లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితులలో నీటిని పోదుపు గా వాడుకోవాలి సూచించారు. పంచాయతీలలో నీటి సరఫరా విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మంచినీటి పైపులకు ట్యాప్ లేకుండా నీటిని వృధాగా వదులుతున్నారని పలుచోట్ల ఫిర్యాదులు అందాయని పేర్కొన్నారు. వెంటనే ఆ పంచాయతీలలో నీటి రక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ప్రతీ ఇంటా ఇంకుడు గుంత తప్పకుండా ఉండాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. నీటి కుంటలకు రైతుల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. కమ్యూనిటీ ఇంకుడు గుంతలను గుర్తించి వెంటనే పనులు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా జలసిరి పథకంలో గుర్తించిన పనులను సకాలంలో శర వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రతీ పంచాయతీలో షెడ్యూల్ ప్రకారం ఫాగింగ్ చేయించాలన్నారు. డ్రైడే..ఫ్రైడే కార్యక్రమాల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం ను ఆకస్మికంగా తనిఖీలు చేయించి నిర్లక్ష్యం చేసిన వారి పై చర్యలు తీసుకునేందుకు కార్యచరణ ను రూపొందించినట్లు తెలిపారు. ప్రతీ పంచాయతీలో పారిశుద్ధ్య పనులను చేపట్టాలని సూచించారు. ఇంకుడు, పంట కుంటల పై అవగాహేన కల్పించాలన్నారు. యూజర్ ఐడీ, పాస్వర్డ్ ఎవరికి సంబంధించిన వారివి వారే దగ్గర చాలా గోప్యంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆజయ్ండా పంచాయతీ సర్పంచ్ తేజావత్ శివాజీ, పంచాయతీ కార్యదర్శి బైరం దినేష్కుమార్ లు ఉన్నారు.

# పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలి

## - పీఆర్‌టీయూ–టీఎస్




**మంథని, ఆగస్టు 12, నేటి శుభోదయ :** ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం వెంటనే స్పందించి పీఆర్‌సీని ప్రకటించాలని పీఆర్‌టీయూ–టీఎస్ పెద్దపల్లి జిల్లా శాఖ డిమాండ్ చేసింది. గత మూడేళ్లుగా పీఆర్‌సీ లేకపోవడంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆర్థికంగా నష్టపోతున్నారని సంఘం నాయకులు పేర్కొన్నారు. బుధవారం మంథని మండలంలోని వివిధ పాఠశాలల్లో పీఆర్‌టీయూ–టీఎస్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ–టీఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు గండు కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి కానుగంటి శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే పీఆర్‌సీని ప్రకటించాలని కోరారు. పీఆర్‌సీ అమలులో జాప్యం కారణంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం సంఘం ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలకు అందరూ ఐక్యంగా మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేసేందుకు పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు తరలివచ్చి పాల్గొనాలని కోరారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మంథని మండల అధ్యక్షుడు ఎగడి సురేష్, ప్రధాన కార్యదర్శి పచ్చిక స్వరూప, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కొమురయ్యతో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లకు 15 కేంద్రాలు

**మేడ్చల్ మల్కాజిగిరి, ఆగస్టు 12, నేటి శుభోదయ :** ఖరీఫ్ 2026–27 సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు జిల్లా కలెక్టర్ (పౌరసరఫరాలు) డి. విజయేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన ఏర్పాట్లపై బుధవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 15 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, కొనుగోళ్లకు అవసరమైన మేరకు గన్నీ సంచులను అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతులు ధాన్యాన్ని తడి, తాలు, దుమ్ము లేకుండా శుభ్రపరిచి, బాగా ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని అవగాహన కల్పించాలని అధికారులకు తెలిపారు. వరికోత సమయంలో నూర్పిడి యంత్రాల యజమానులతో సమన్వయం చేసుకుని ధాన్యం క్రమపద్ధతిలో కొనుగోలు కేంద్రాలకు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జీలు, వ్యవసాయ విస్తరణ అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు.ట్యాబ్ ఎంట్రీలు అదే రోజు పూర్తి చేయాలిట్యాబ్ ఎంట్రీలు ఆలస్యం కావడం వల్ల రైతుల చెల్లింపులు ప్రభావితమవుతున్నందున ప్రతి ఎంట్రీని అదే రోజు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు జిల్లా స్థాయిలో నిరంతరం సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు. రైతులు ధాన్యం విక్రయించిన 48 గంటల్లోపు వారి బ్యాంకు ఖాతాల్లో నేరుగా నగదు జమయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల మేనేజర్ ఎల్. సుగుణబాయి, వ్యవసాయ విస్తరణ అధికారి చంద్రకళ, జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా న్యాయ కొలతల అధికారి ఎం.డి. రియాజ్, ఇతర అధికారులు పాల్గొన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ధాన్యం కొనుగోళ్లను విజయవంతంగా నిర్వహించి జిల్లాకు, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని అదనపు కలెక్టర్ సూచించారు.



# ఒన్నాజిపేట్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు సౌండ్ సిస్టమ్ వితరణ



**నిజామాబాద్ రూరల్, ఆగస్టు 12, నేటి శుభోదయ :** ధర్పల్లి మండలం, ఒన్నాజిపేట్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు (BC కాలనీ) ఒక ఉదారమైన వితరణ లభించింది. పాఠశాల విద్యార్థుల ప్రయోజనార్థం, ఫౌండేషన్ సభ్యులు సుమారు ₹8,000/- విలువైన అత్యాధునిక సౌండ్ సిస్టమ్‌ను బహుకరించారు.ఈ రోజు పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన ఒక చిన్న కార్యక్రమంలో, ఫౌండేషన్ ప్రతినిధులు ఈ పరికరాన్ని పాఠశాల సిబ్బందికి అందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వెంకట్రామయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. నరేందర్, గ్రామ సర్పంచ్, మరియు వార్డు మెంబర్ రాఘవేందర్ గౌడ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ఇలాంటి సేవా కార్యక్రమాలు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు మరియు పాఠశాల అభివృద్ధికి ఎంతో తోడ్పడతాయని అన్నారు. ఫౌండేషన్ యొక్క ఈ చొరవను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ముఖ్యంగా ప్రార్థన సమయాల్లో, పాఠశాల సమావేశాలు, సాంస్కృతిక ఉత్సవాల సందర్భంలో ఈ సౌండ్ సిస్టమ్ ఉపయోగపడుతుందని తెలిపారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. నరేందర్, విద్యార్థులు, మరియు వారి తల్లిదండ్రులు ఈ గొప్ప వితరణ చేసిన ఫౌండేషన్ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వారు తమ పాఠశాలకు అవసరమైన ఇలాంటి పరికరాలను అందించడం ద్వారా, విద్యార్థులకు మంచి వాతావరణం కల్పించడంలో సాయపడినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఫౌండేషన్ సభ్యులు తమ సహాయాన్ని ఇతోధికంగా అందిస్తూ, సామాజిక బాధ్యతతో పనిచేస్తున్నారని అందరూ కొనియాడారు.

# ఆశా కార్యకర్తపై దాడి.. కఠిన చర్యలు...

## - బాధితురాలికి అండగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ..




**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 12, నేటి శుభోదయ :** దుమ్ముగూడెం మండలం కోయినవారిపురం లో ఆశా కార్యకర్తపై జరిగిన దాడి ఘటనపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పందించారు. బాధిత ఆశా కార్యకర్తతో పాటు ఆశా యూనియన్ నాయకులు బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. తుకారామ్ రాథోడ్‌ను పాల్వంచ నవభారత్‌లోని సమీకృత జిల్లా అధికారుల సముదాయ భవనం లోని కార్యాలయంలో కలిసి వినతి పత్రం సమర్పించారు.ఈ నెల 07న కోయినవారిపురం గ్రామంలో ఓ కుటుంబంలో జరిగిన ఘటనకు సంబంధించి అక్కడికి వెళ్లిన ఆశా కార్యకర్తపై కొందరు వ్యక్తులు దాడి చేసి దురుసుగా ప్రవర్తించినట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ ఘటనలో ఆమె గాయపడటంతో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. విధి నిర్వహణలో భాగంగా ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశా కార్యకర్తలపై దాడులు జరగడం ఆందోళనకరమని యూనియన్ నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డా. తుకారామ్ రాథోడ్ బాధిత ఆశా కార్యకర్తను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పూర్తిగా కోలుకునే వరకు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఆశా కార్యకర్తల భద్రతకు వైద్య ఆరోగ్య శాఖ అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. ఘటనపై సంబంధిత అధికారులతో మాట్లాడి చట్టపరమైన చర్యలు తీసుకునేలా చూస్తామని, అవసరమైతే బాధ్యులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయించేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆశా కార్యకర్తలు మాతా, శిశు ఆరోగ్యం, గర్భిణుల సేవలు, టీకాలు, కుటుంబ సంక్షేమం, వ్యాధి నిరోధక కార్యక్రమాలు తదితర కీలక సేవలను అందిస్తున్నారని డీఎంహెచ్‌వో పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఏవైనా ఇబ్బందులు లేదా భద్రతాపరమైన సమస్యలు ఎదురైతే వెంటనే సంబంధిత వైద్యాధికారులకు సమాచారం అందించాలని సూచించారు.ఆశా కార్యకర్తల విధులకు ఆటంకం కలిగించడం, వారిపై దాడులకు పాల్పడటం వంటి ఘటనలను తీవ్రంగా పరిగణిస్తామని, సంబంధిత శాఖల సమన్వయంతో అవసరమైన చర్యలు తీసుకుంటామని డా. తుకారామ్ రాథోడ్ స్పష్టం చేశారు. బాధితురాలికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆశా యూనియన్ నాయకులు కోరుతూ డీఎంహెచ్‌వోకు కృతజ్ఞతలు తెలిపారు.

# మంథనిలో హెచ్ఐవీ

## - ఎయిడ్స్‌పై అవగాహన




**మంథని, ఆగస్టు 12, నేటి శుభోదయ :** ప్రజల్లో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన పెంపొందించేందుకు పీహెచ్‌సీ గద్దలపల్లి ఆధ్వర్యంలో బుధవారం మంథనిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఐవీ వ్యాప్తికి కారణాలు, నివారణ చర్యలు, అపోహలు–నిజాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంథని పట్టణ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్ హాజరయ్యారు. వైస్ చైర్మన్ ముసుకుల సహేందర్‌రెడ్డి, కౌన్సిలర్ ఎల్లంకి వంశీ, డాక్టర్ సబ్బని శివాని పాల్గొని హెచ్ఐవీ–ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఆరోగ్య పరిరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు, ఐసీటీసీ కౌన్సిలర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ శ్రీ శ్రీ పోచమ్మ తల్లి బోనాలు భక్తజనుల సంబరం..

### - పాల్గొన్న సంగారెడ్డి జిల్లా దిశ కమిటీ సభ్యులు బిజెపి మహిళా మోర్చా సీనియర్ నాయకులు కే.సుజాత





**పటాన్ చేరు, ఆగస్టు 13, నేటి శుభోదయ :** మంగళవారం రోజు పటాన్ చెరు పట్టణంలో ఆషాఢం బోనాల పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బోనాల జాతర సందర్భంగా పలు బోనాలు, పలారం బండి, తొట్టెల, ఘట్టాల ఊరేగింపు, కళాకారుల నృత్యాలు కార్యక్రమం మంగళవారం నిర్వహిస్తున్నట్లు శ్రీ శ్రీ శ్రీ పోచమ్మ తల్లి ఆలయ ధర్మకర్తలు తెలిపారు. పలు నాయకులతో సహా సంగారెడ్డి జిల్లా దిశ కమిటీ సభ్యులు బిజెపి మహిళా మోర్చా సీనియర్ నాయకురాలు కే సుజాత తమ కుటుంబ సభ్యులతో ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. సుజాత మాట్లాడుతూ, బోనాల జాతరలో భక్తులు ఎంతో సంబురంగా పాల్గొంటారు. అమ్మవారికి మహిళలు, భక్తులు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారి బోనం సమర్పిస్తారు. ఈ పండుగ తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమైన పండుగలలో ఒకటి. బోనాల జాతర, తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యంగా హైదరాబాద్ జంట నగరాలలో జరుపుకునే ఒక ముఖ్యమైన పండుగ. అమ్మవారికి భక్తి శ్రద్ధతో బోనాలు సమర్పించడం తెలంగాణ ప్రజల సంస్కృతి సాంప్రదాయాలను, తెలుగు జాతి ఆత్మగౌరవానికి ప్రతీక. తెలంగాణ ఆషాఢ మాస బోనాల సంప్రదాయంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ లోని విజయవాడ ఇంద్ర కీలాద్రిపై కొలువుదీరిన కనకదుర్గమ్మ అమ్మవారికి ప్రతి ఏటా తెలంగాణ భక్తులు ఘనంగా బోనాలు సమర్పిస్తారు. హైదరాబాద్‌లోని భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేకంగా బంగారు బోనం సమర్పించే ఆనవాయితీ కొనసాగుతోంది. రెండు రాష్ట్రాల మధ్య సాంస్కృతిక, భక్తి భావాలను పెంపొందించేలా ఈ వార్షిక బోనాల వేడుక దశాబ్దానికి పైగా కొనసాగుతు వస్తుంది.ఆలయాలలో బోనాల ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా భక్తులు ప్రత్యేకంగా తయారు చేసిన బోనాలను స్వామివారికి సమర్పించి, మొక్కులు తీర్చుకుంటారు. శివసత్తుల పూనకాలు, డోలు వాయిద్యాలు, పట్నాలు, అగ్ని గుండాలు ఈ జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జంట నగరాల వాసులు తమ తమ బంధువులు ఆహ్వానించి గ్రామ దేవాలయంలో ప్రత్యేక పూజలకు పాల్గొనడం తరతరాలు నుండి వచ్చిన ఆచారం ఈ బోనాల జాతర.. ఈ జాతరలో వినోద్ కుమార్ ముదిరాజ్ , సాయి ముదిరాజ్ , చిట్ల శివ కుమార్ ముదిరాజ్ ,( పి ఆర్ & మీడియా కన్సల్టెంట్ ), గౌతంనగర్ బిజెపి బూత్ అధ్యక్షులు కుందన్ ముదిరాజ్, పెన్సిల్ ఆర్టిస్ట్ కార్తీక్ , నాగసాని జగదీష్ , నాగసాని నర్సింగ్ ముదిరాజ్ పూజలో పాల్గొన్నారు.

## స్థలాలకు బదులు స్థలాలు ఇచ్చి అభివృద్ధి పరచండి - లంకల నిఖిలా




**పటాన్ చేరు, ఆగస్టు 13, నేటి శుభోదయ :** మూసి రివర్ ఫ్రంట్ ప్రాజెక్టులో భాగంగా కిస్మత్పూర్ గ్రామానికి చెందిన దేవాలయ, స్మశాన, క్రీడా మైదానాలకు సంబంధించిన స్థలాలు వెళ్తున్న నేపథ్యంలో వాటి స్థానంలో గ్రామంలోని ఉన్న ప్రభుత్వ స్థలాలను కేటాయించాలని కోరుతూ మాజీ కార్పొరేటర్ లంకల నిఖిల సంగారెడ్డి ప్రతినిధి సంగారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన మూసి రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు స్పెషల్ గ్రేడ్ జాయింట్ కలెక్టర్ వెంకట్ రెడ్డి నీ కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూసి రివర్ ఫ్రంట్ పథకంలో భాగంగా చరిత్రత్మకమైన మల్లన్న దేవాలయ భూములు పోతున్నాయన్నారు.అలాగే గ్రామానికి చెందిన అన్ని కులాల స్మశాన వాటికలు మూసి పరివాహక ప్రాంతంలో ఉన్నాయన్నారు. ప్రాజెక్టు అభివృద్ధిలో భాగంగా ఈ స్మశానవాటికలు కనుమరుగు కానున్నట్టు తెలిపారు. అలాగే ప్రతిరోజు వృద్ధులు, మహిళలు, పిల్లలు వాకింగ్ తో పాటు ఆడుకునేందుకు గ్రౌండ్ లు ఉన్నాయని ప్రభుత్వ స్థలాలలో ఉన్న ఈ గ్రౌండ్లు అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. దేవాలయ నికి సంబంధించిన భూమిని ఎంత తీసుకున్న అంత భూమి తిరిగి ఇవ్వాలన్నారు. అలాగే దేవాలయాన్ని పునర్నిర్మించి అన్ని రంగులతో అభివృద్ధి పరచాలన్నారు.అన్ని వసతులతో గ్రామంలోని ప్రభుత్వ స్థలంలో స్మశాన వాటికను ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ స్థలంలో అందరి కోసం క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఇదే విషయాన్ని వినతి పత్రంలో వివరించినట్టు తెలిపారు.

### ఘనంగా మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్ రెడ్డి జన్మదిన వేడుకలు

## రక్తదాన శిబిరం ఏర్పాటు





**చైతన్యపురి, ఆగస్టు 12, నేటి శుభోదయ :** చైతన్యపురి డివిజన్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్ రెడ్డి జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు, స్నేహితులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకలకు ఎల్బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, తోట మహేష్ యాదవ్‌తో, పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీ అధ్యక్షులు, మహిళలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా జిన్నారం విఠల్ రెడ్డి, కేక్ కట్ చేయగా, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, తోట మహేష్ యాదవ్‌తో పాటు పలువురు నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.అభిమానులు పూలమాలలు వేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమం సందడిగా సాగింది.అనంతరం నాయకులు మాట్లాడుతూ.. జిన్నారం విట్టల్ రెడ్డి చైతన్యపురి డివిజన్‌లో ప్రజలతో సన్నిహితంగా ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తున్నారని అన్నారు. మాజీ కార్పొరేటర్‌గా డివిజన్ అభివృద్ధికి తనవంతు కృషి చేశారని, ప్రజల సమస్యలపై నిరంతరం స్పందించే నాయకుడిగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ అందరి ఆదరాభిమానాలను పొందుతున్నారని తెలిపారు. జిన్నారం విఠల్ రెడ్డి ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని, మరిన్ని పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలని నాయకులు, అభిమానులు ఆకాంక్షించారు. రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు.అనంతరం వచ్చిన కార్యకర్తలకు అభిమానులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, కాలనీ అధ్యక్షులు, మహిళా నాయకులు, యువకులు, అభిమానులు, స్నేహితులు పెద్ద సంఖ్యలో పాల్గొని జిన్నారం విఠల్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## బ్యాంకింగ్ సేవలు కస్టమర్లకు మరింత చేరువ : ఏజీఎం సామ్రాట్



**ఖైరతాబాద్, ఆగస్టు 13, నేటి శుభోదయ :** బ్యాంక్ ఆఫ్ ఇండియా కస్టమర్లకు మరింత చేరువ అవుతూ సేవలను అందిస్తుందని బ్యాంక్ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సామ్రాట్ తెలిపారు. బుధవారం ఖైరతాబాద్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ లో కస్టమర్ రిలేషన్షిప్ కార్యక్రమాన్ని ఆయన ఏజీఎం రోజా రమణి తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏజీఎం సామ్రాట్ మాట్లాడుతూ... బ్యాంకింగ్ రంగంలో నూతన టెక్నాలజీని వినియోగిస్తూ సేవలను మరింత వేగవంతం చేయడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం కస్టమర్లకు అనేక పథకాలను అమలు చేస్తుందని వాటిని ఖాతాదారులకు వివరిస్తూ ఫలితాలు అందేలా పనిచేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఖాతాదారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ రాయప్ప తదితరులు పాల్గొన్నారు.

## హర్ ఘర్ తిరంగా

### దేశభక్తి చాటుదాం - ప్రతి ఇంటా జాతీయ జెండా ఎగరవేద్దాం



**కొత్తపేట, ఆగస్టు 12, నేటి శుభోదయ :** హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ శ్రీ నాయకోటి పవన్ కుమార్ తన నివాసం పై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటుకున్నారు.ఈ సందర్భంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి, దేశ సమైక్యత, సమగ్రత, గౌరవాన్ని చాటాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మన జాతీయ జెండా కేవలం ఒక పతాకం మాత్రమే కాదు... కోట్లాది భారతీయుల త్యాగాలకు, స్వాతంత్ర్య సమరయోధుల పోరాటానికి, దేశ గౌరవానికి ప్రతీక.ఈ కార్యక్రమంలో బీజేపీ కొత్తపేట డివిజన్ అధ్యక్షులు శ్రీ మంచి రాజేష్ కుమార్, అశ్విన్ సింగ్, శ్రీనివాస్ రెడ్డి, వెంకట రెడ్డి, కొత్త తిరుమల,వీరా రెడ్డి, ర్యాక శ్రీనివాస్, శంకర్రావు, ఉదయ్ జోషి, శ్రవణ్, అజయ్, ప్రసాద్, తదితరులు పాల్గొని జాతీయ జెండాకు గౌరవ వందనం సమర్పించారు.

## శ్రీశ్రీశ్రీ పోచమ్మ దేవాలయానికి విరాళం అందజేసిన చిలుక ఉపేందర్ రెడ్డి



**కొత్తపేట, ఆగస్టు 12, నేటి శుభోదయ :** కొత్తపేట డివిజన్ పరిధిలోని భారత్ నగర్ లో శ్రీ పోచమ్మ దేవాలయంలో అమ్మవారి నూతన విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ ఆహ్వాన పత్రికను రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చిలుక ఉపేందర్ రెడ్డి-గారికి అందజేసిన కమిటీ సభ్యులు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులకు దేవాలయ అభివృద్ధికి సహకరిస్తూ అక్షరాల ₹51000/- రూపాయల విరాళాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో మామిడి రామచందర్, ఆకుల వెంకటేష్, మధుసూదన్, సత్యం, శ్రీనివాస్, బాలాజీ, మల్లేష్, శంకర్, కృష్ణ,_ తదితరులు పాల్గొన్నారు.

గురువారం | హైదరాబాద్
13 - 08 - 2026
www.netisubhodaya.com
నేటి శుభోదయ



## కార్పొరేట్ ఆసుపత్రుల్లో జర్నలిస్ట్ లకు హెల్త్ కార్డు వర్తింపు చేయాలి





**నిజామాబాద్, ఆగస్టు 12, నేటి శుభోదయ :** ప్రభుత్వ ఉద్యోగుల తరహాలోనే జర్నలిస్ట్ లకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్య సదుపాయం కల్పించాలని టీయూడబ్ల్యూజె హెచ్–143 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతీ సాగర్ అన్నారు.బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బీ అతిథిగృహంలో జిల్లా టీయూడబ్ల్యూజె హెచ్–143 ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ....తెలంగాణ ఉద్యమంలో క్రీయాశీలక భూమిక పోషించిందన్నారు.జర్నలిస్ట్ లకు రూ. 47 కోట్లతో వెల్ఫేర్ ఫండ్ ఏర్పాటు చేశామని,అలాగే ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం డేస్క్ జర్నలిస్ట్ లకు సపరేట్ అక్రిడేషన్ కార్డులు ఇస్తానని జీవో తీసుకురావడంతో వ్యతిరేకించినట్లు చెప్పారు.చిన్న పత్రికలకు అక్రిడేషన్ మెలుకలు పెడితే వీటి కోసం పోరాటం చేయడంతో ప్రభుత్వం అక్రిడేషన్ కార్డులు ఇచ్చేందుకు ముందుకు వచ్చిందన్నారు.ప్రధానంగా జర్నలిస్ట్ లకు ఇండ్లస్థలాలు అందించాలని డిమాండ్ చేశారు.ఇందులో జిల్లా అడహక్ కమిటీ కన్వీనర్ గా రజినీష్,కో కన్వీనర్ మోహన్,గౌరవ అధ్యక్షులుగా పప్పుఖాన్ తోపాటు 10 మందితో కమిటీ ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో రమణ,యోగన్న,టీయూడబ్ల్యూజే జిల్లా ముఖ్య నాయకులు తదితరులు ఉన్నారు.

## శ్రీ ఆర్యవైశ్య వాసవి మాత సేవా సమితి ఆధ్వర్యంలో కొత్తపేట న్యూ నాగోల్‌లో ఘనంగా అమావాస్య అన్న ప్రసాద వితరణ



**కొత్తపేట, ఆగస్టు 12, నేటి శుభోదయ :** కొత్తపేట న్యూ నాగోల్‌లోని శ్రీ ఆర్యవైశ్య వాసవి మాత సేవాసమితి ఆధ్వర్యంలో అమావాస్య అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా వాసవి మాతకు, గాంధీకి పూలమాల సమర్పించారు.ఈ కార్యక్రమానికి చైతన్య పురి సీఐ కే. సైదులు ముఖ్య అతిథిగా హాజరై అన్న ప్రసాద వితరణలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కే. సైదులు మాట్లాడుతూ...అమావాస్య సందర్భంగా అన్నదానం చేయడం అభినందనీయమని అన్నారు. ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టడం గొప్ప సేవా కార్యక్రమమని, ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాలని ఆకాంక్షించారు. సేవా కార్యక్రమాల ద్వారా సమాజంలో మానవతా విలువలు పెంపొందుతాయని తెలిపారు.సేవాసమితి అధ్యక్షులు యర్రమళ్ల శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ... అమావాస్య సందర్భంగా ప్రతి నెల అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆర్యవైశ్య వాసవి మాత సేవా సమితి ఆధ్వర్యంలో భక్తి కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు.కార్యక్రమానికి సహకరిస్తున్న కమిటీ సభ్యులు, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.అన్న ప్రసాద వితరణకు సహకరించిన కమిటీ సభ్యులు కుమారస్వామి, భూశెట్టి సురేష్, పూరి సిమ్మయ్య, సి.హెచ్ నాగరాజు, కే.శ్రీనివాసులు, సంజయ్ అగ్రవాల్, పచ్చిపులసు శ్రీనివాసరావు, శ్రీకాకుళం శ్రీనివాస్, శ్రీకాంత్, ఐశ్వర్ కుమార్, రమణ, నారాయణ, పోలలక్ష్మి , బి.నాగరాజు, తేలుకుంట్ల సుధాకర్, లగిశెట్టి గురవయ్య, వినోద్, దివాకర్, నూనెరాని నల్ల శ్రీనివాస్, పత్తి శ్రీధర్, హనుమంతరావు, ఏ. ప్రభాకర్ రావు, కే.నాగరాజు, కన్నా శ్రీనివాసులు, మేడిశెట్టి వెంకటేష్, రాజారావు, మహిళలు ను తదితరులను అధ్యక్షులు ప్రత్యేకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

## జైశ్రీరామ్ సేవా సమితి ఆధ్వర్యంలో అమావాస్య అన్నదాన కార్యక్రమం



**కొత్తపేట, ఆగస్టు 12, నేటి శుభోదయ :** జైశ్రీరామ్ సేవా సమితి అధ్యక్షులు ఠాగూర్ ఉపేందర్ సింగ్ చౌహన్ ఆధ్వర్యంలో కొత్తపేటలోని మోహన్ నగర్‌లో బుధవారం అమావాస్య అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ హాజరై భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.నాయకోటి పవన్ కుమార్ మాట్లాడుతూ.. అమావాస్య సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు.ఆధ్యాత్మికతతో పాటు సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా సమాజంలో సేవాభావాన్ని పెంపొందించవచ్చని తెలిపారు. జైశ్రీరామ్ సేవా సమితి ఆధ్వర్యంలో గత మూడు సంవత్సరాలుగా కొనసాగుతున్న అన్నదాన కార్యక్రమం ఎంతో మందికి ఉపయోగకరంగా ఉంటోందన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా బిజెపి రంగారెడ్డి జిల్లా అర్బన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఠాగూర్ ఉపేందర్ సింగ్ చౌహన్ మాట్లాడుతూ.. గత మూడు సంవత్సరాలుగా అమావాస్య సందర్భంగా మోహన్ నగర్‌లో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. అమావాస్య రోజున అన్నదానం చేయడం ఎంతో పుణ్యప్రదమని పెద్దలు చెప్పిన మాటలను ఆచరిస్తూ ప్రతి నెలా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 600 మందికి పైగా పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించినట్లు తెలిపారు.భవిష్యత్తులోనూ ప్రతి అమావాస్య రోజున అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో మీడియా ఇన్‌చార్జి సంగ్రామ్, వీరేష్, సురేందర్ ప్రసాద్, భాను ప్రకాష్, రవీందర్ సింగ్ ఠాగూర్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

# ల్యాబ్ యజమాకి బెదిరింపులు

- స్థానిక ఠాణా లో ఫిర్యాదు
- రౌడీయిజం చేస్తున్న నైజం
- స్టేటాంతా తిరుగుతున్న వైనం
- బెదిరించారు ఫోన్ కూడా గుంజారు
- మహిళే ప్రధాన సూత్రధారిగా వెలుబడుతున్న అంశం
- భయంతో ల్యాబ్ యజమాని జ్వరంతో బెంబేలు
- యూనియన్ లబోదిబోమన్న వినని పరిస్థితి




**ఖమ్మం, ఆగస్టు 12, నేటి శుభోదయ :** ప్రభుత్వ ఉద్యోగుల తరహాలోనే జర్నలిస్ట్ లకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్య సదుపాయం కల్పించాలని టీయూడబ్ల్యూజె హెచ్–143 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతీ సాగర్ అన్నారు.బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బీ అతిథిగృహంలో జిల్లా టీయూడబ్ల్యూజె హెచ్–143 ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ....తెలంగాణ ఉద్యమంలో క్రీయాశీలక భూమిక పోషించిందన్నారు.జర్నలిస్ట్ లకు రూ. 47 కోట్లతో వెల్ఫేర్ ఫండ్ ఏర్పాటు చేశామని,అలాగే ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం డేస్క్ జర్నలిస్ట్ లకు సపరేట్ అక్రిడేషన్ కార్డులు ఇస్తానని జీవో తీసుకురావడంతో వ్యతిరేకించినట్లు చెప్పారు.చిన్న పత్రికలకు అక్రిడేషన్ మెలుకలు పెడితే వీటి కోసం పోరాటం చేయడంతో ప్రభుత్వం అక్రిడేషన్ కార్డులు ఇచ్చేందుకు ముందుకు వచ్చిందన్నారు.ప్రధానంగా జర్నలిస్ట్ లకు ఇండ్లస్థలాలు అందించాలని డిమాండ్ చేశారు.ఇందులో జిల్లా అడహక్ కమిటీ కన్వీనర్ గా రజినీష్,కో కన్వీనర్ మోహన్,గౌరవ అధ్యక్షులుగా పప్పుఖాన్ తోపాటు 10 మందితో కమిటీ ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో రమణ,యోగన్న,టీయూడబ్ల్యూజే జిల్లా ముఖ్య నాయకులు తదితరులు ఉన్నారు.

**- పోలీస్ అధికారులే అడ్డుకట్ట వేయాలి**

ఏదో పత్రిక పేరు చెప్పుకుంటూ కనీసం జర్నలిజంపై అవగాహన లేకపోవడం, సమస్యలపై పట్టువిడుపు సమతూలించటం విధిగా మారింది అని జిల్లా వ్యాప్తంగా గుసగుసలు కొనసాగుతున్నాయి. పత్రికా యాజమాన్యాల సహకరిస్తున్నారేమో అనే ప్రస్తావాలు కూడా అనేకంగానే చర్చనీ అంశం అయ్యాయి. విచ్చలవిడిగా దురక్రమాలకు పాల్పడుతున్న నకిలీ విలేకరులపై జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీసు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటేనే పాత్రికేయ రంగాన్ని కాపాడిన పోలీస్ యంత్రాంగం అవుతుందని పలువురు ప్రశంసనిస్తున్నారు.

**- ఏం చదువుకోకున్న అక్రిడిడేషన్**

అనుభవముండదు, చివరికి చదువు ఉండదు, కానీ ఐదు వందలు కడతారు పత్రికేయ రంగ గుర్తింపు కార్డును పొందుతారు. ఎలాంటి పరిజ్ఞానం లేకున్నా ఇరవై వేలు కడితే అక్కి డేస్ ఇచ్చే సంస్థలు అనేకంగానే ఉన్నాయి. పత్రికా ధర్మం ప్రకారం కథను సారాంశం రాయటం మాత్రం నేటికీ నూటికి తొంభై ఐదు శాతం శూన్యంగానే ఉంది అంటూ పలువురు నిపుణులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. పెద్ద పెద్ద పత్రికల్లోనే చదువు రాని పాత్రికేయుగా చలామణి అవుతున్నారు, ఓ చిన్నపాటి సంస్థలో చలామణి అవుతే తప్పేంటి అని, పలువురు పాత్రికేయుడ్ని అనే భ్రమలో ఉన్న నిపుణులు ఆరోపిస్తున్నారు.

**- తప్పు ఎవరిది...!**

విద్యా అర్హతలు లేకపోవడం, దృష్టి సవరింపుగా కథనరంగంలో పరిజ్ఞానం లేకపోవడం , లేనప్పటికీ యాజమాన్య రంగాలే సహకరిస్తుండటం, విడ్డూరంగా మారిందని పలువురు ఆరోపిస్తున్నారు. ఐదు, ఆరు, పదీ ఫెయిల్ అయిన వాళ్ళే జర్నలిస్టుగా చలామణి అయితే జర్నలిజం చదివిన వాళ్లు ఏమైపోతారు జర్నలిజం అంటూ, స్టూడెంట్ యూనియన్ ఓవైపు సమస్యను ప్రత్యేకంగా వెల్లువెత్తుతుంది. ఇటీవలే విడుదలైన అక్రిడేషన్ కార్డులు కూడా అనేకంగానే ఎలాంటి అర్హత లేని అభ్యర్థులకు జారీ చేశారన్న ఆరోపణలు కూడా సమస్యల వలయంగా మారిందని పలువురు జర్నలిస్టులు డి పి ఆర్ ఓ లకు ఫిర్యాదులు చేసిన సందర్భాలు అనేకంగానే ఉన్నాయి. ఏది ఏమైనాప్పటికీ కొత్తగూడెం పాల్వంచ, వి ఎం బంజర పరిసర ప్రాంతాల నుంచి జిల్లాలు, రాష్ట్రాలు వారీగా వసూళ్లకు పాల్పడుతున్న అభ్యర్థులపై తక్షణమే పోలీసు అధికారులు చర్యలు తీసుకుంటే కొంతమేరకైనా అదంతాలకు అడ్డుకట్ట వేసే పరిణామాలు పుష్కలంగా ఉన్నాయని పలువురు స్థానికులు కోరుకుంటున్నారు.

**- యజమాని ఏమంటున్నాడంటే**

జిల్లా న్యూస్ హెడ్ ఆఫీస్ నుంచి వచ్చామని, ఫార్మాలిటీ కచ్చితంగా ఇవ్వాల్సిందేనని, ఇవ్వకుంటే దాడి చేయడానికైనా సిద్ధంగా ఉన్నామని, టీ షాపు వద్ద ల్యాబ్ యూనియన్ సభ్యులతో కలిసి టీ తాగుతా ఉంటే మమ్మల్ని చూసి తక్షణమే పారిపోయారని ఫోన్ చేసి రహస్యంగా ఒక్కడివే పార్కుల గండికి రావాలని, పార్కులగండి వెళ్లిన తర్వాత చరవాణిని బలవంతంగా గుంజుకున్నారని, బలవంతంగానే చరవాణిలో ఉన్న ఫోన్ పే యాప్ ను ఓపెన్ చేసి నగదును తనిఖీ చేశారని, అత్యవసరంగా నగదు చెల్లించకుండా ఉంటే ఎంతటికైనా సిద్ధమే అని బెదిరించారని, నగదును కూడా వేరొక ఎకౌంటుకు తరలించాలని ఆదేశించారని, మరికొన్ని క్షణాల్లోనే మరింత నగదును చెల్లించుకుంటే రౌడీలా మారటానికి మాకు క్షణమైన సమయం పట్టదని, కొంత నగదు నువ్వు చెల్లించిన తర్వాత వెళ్లిపోయారని, వెళ్లిన కొద్దిసేపటి నుంచే నిరంతరం క్షణం కూడా తీరిక లేకుండా ఫోన్ చేస్తున్నారని ఒత్తిడిని తట్టుకోలేక దమ్మపేట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశానని, ప్రస్తుతం ల్యాబ్ కు వెళ్లాలంటే భయమేస్తుందని, వాళ్లు భయభ్రాంతులకు గురి చేసిన సంఘటనలు మరవలేకున్నానని, ఆరోగ్యం పూర్తిస్థాయిలో క్షీణించి పోయిందని తెలుపుతున్నారు.

Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620